ENTERED KSR02B144 C

ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం
నవంబర్ 06, 2016

స్నేహ

సమతా రాజ్యం..
సాంస్కృతిక వికాసం...



బాలీవుడ్ డబుల్ రోల్స్



బాలీవుడ్‌లో ద్విపాత్రాభినయంలో వచ్చిన చిత్రాలు తారలకు మంచి గుర్తింపునిచ్చాయి. 1933లో 'ఆవారా షాహ్‌జాదా' చిత్రం ద్వారా బాలీవుడ్‌లోకి ప్రవేశించిన డ్యూయల్ రోల్ ఫార్ములాతో ఇప్పటికే వందల సంఖ్యలో చిత్రాలు విడుదలయ్యాయి. జుడ్వా, డూప్లికేట్, రౌడీ రాథోర్, లవ్ ఆజ్‌కల్, క్రిష్, ధూమ్-3 చిత్రాల రూపంలో సల్మాన్, షారుక్, అక్షయ్, సైఫ్, హ్రితిక్, అమీర్‌లకి సక్సెస్ రేట్‌ని పెంచిన ఈ ఫార్ములానే ఫిల్మ్‌మేకర్లు ఫాలో అవుతున్నారు. వరుణ్ ధావన్ నటించిన డిషూమ్ చిత్రం ఈ సంవత్సరం బాలీవుడ్‌లో భారీస్థాయిలో కలెక్షన్లని సొంతం చేసుకోవడంతో వరుణ్‌కి పెద్ద ఎత్తున సినీ అవకాశాలు దక్కాయి. సల్మాన్ ఖాన్ సీక్వెల్ చిత్రం జుడవా-2లో ద్విపాత్రాభినయంలో కనిపించనున్నాడు వరుణ్ ధావన్. 'స్టూడెంట్ ఆఫ్‌ది ఇయర్', 'కపూర్ అండ్ సన్స్' ఏక్‌థా టైగర్ చిత్రాలతో ప్రేక్షకులని ఆకట్టుకున్నాడు. సిద్ధార్థ్ మల్హోత్రాకి డ్యుయో రాజ్, డి.కె దర్శకత్వంలో రూపొందుతున్న బ్యాంగ్ బ్యాంగ్-2లో డ్యూయల్ రోల్‌లో నటించే అవకాశం దక్కింది. ద్విపాత్రాభినయంలో అదరగొట్టిన కపూర్ ఫ్యామిలీ నుండి వచ్చిన యువ నటుడు అర్జున్ కపూర్. ప్రస్తుతం ముబారకన్ చిత్రంలో డబుల్ రోల్‌లో దర్శనమివ్వనున్నాడు. ఒకప్పటి సక్సెస్ ఫార్ములా నేటితారలకి ఎలాంటి రిజల్ట్‌ని ఇస్తుందో వేచిచూడాల్సిందే!

ENTERED
KSRO3:B1144



రామీ అద్నాన్‌కు ఓ కూతురుంది. ఆ చిట్టి తల్లికి బొమ్మలంటే ప్రాణం. అందుకే రామీ సర్‌ప్రైజ్ గిఫ్ట్‌గా దూది బొమ్మల్ని ఆ చిరు బుగ్గలపై మెత్తగా నిమురుతాడు. అయ్.. వేయి వోల్టుల కాంతి కళ్లలో కనిపిస్తుంది. ఆమె ముఖంలోని వెలుగుతో బివిటీ పట్టేయొచ్చనిపిస్తుంది. సరే మరి తన నేస్తాల మాటేమిటి. అదే మిగతా సిరియా చిన్నారుల సంగతి. ఆ పాల బుగ్గలపై కన్నీటి చారలు ఆరడంలేదు. ఆ కళ్లల్లో తప్పిపోయేంత అంధకారం. అదే రామీ బిడ్డ నవ్వును ఆర్పేసింది. 'నాన్నా..! బొమ్మలు మరి వాళ్లకూ...?' అనే ఆమె విషాద చూపులు అంతకుముందు ఎప్పుడూ లేవు. రామీ మనసు విచ్ఛిన్నమైంది. మళ్లీ ఆ మోములో వేయి వోల్టుల వెలుగు కోసం బొమ్మల స్మగ్లర్‌గా మారాడు. ప్రాణాలను పట్టించుకోకుండా సంతోషాల మూటను సిరియా సరిహద్దుల్ని దాటిస్తున్నాడు. అక్కడి చిన్నారుల్ని బొమ్మల్లో ముంచెత్తి బాల్యం ఛాయల్ని బతికిస్తున్నాడు.

మరి బొమ్మలు... వాళ్లకో?

రామీ బొమ్మల స్మగ్లింగ్‌కు ఐదేళ్లు పూర్తయ్యాయి. ఆయనకు 44 ఏళ్లు వచ్చేశాయి. స్నైపర్‌ల డేగ కళ్లను తప్పించుకుని బోర్డర్ పాట్రోల్ రాడార్లను దాటుకుని... బుల్లెట్ వర్షాలు... బాంబు మోతలకు... వణుకుతున్న వెన్నును తట్టుకుని.. పారిపోయిన ధైర్యాన్ని ఎట్టకేలకు పట్టుకుని పదుల ప్రయత్నాలు చేశాడు. అలెప్పోను దిగ్బంధించాక కట్టుదిట్టమైన సరిహద్దు భద్రత ఏర్పాటు చేశాక కూడా రామీ వెనుకడుగు వేయలేదు. ప్రపంచంలోనే అత్యంత సురక్షిత దేశంగా పిలవబడే ఫిన్‌ల్యాండ్ నుంచి ప్రపంచంలోనే అతి ప్రమాదకర యుద్ధ క్షేత్రంగా మారిన ప్రాంతంలోకి ప్రాణాంతకమైన ప్రయాణాన్ని ఆపలేదు. అలెప్పోలోనే పుట్టి పెరిగిన రామీ 1989లో కుటుంబంతో సహా ఫిన్‌ల్యాండ్‌లో స్థిరపడ్డాడు. 2012లో సిరియా సంక్షోభం తలెత్తాక ఎలాగైన తన ప్రాంత వాసులకు సహాయం చేయాలని భావించాడు. శరణార్థి సంక్షోభంతో గొంతు తడిపే దిక్కులేకపోవడంతో తొలుత ఆహారాన్ని, తాగునీటిని, మందుల్ని తీసుకెళ్లి అందించేవాడు. అలా ఓసారి సరిహద్దు దాటేందుకు ప్రణాళిక వేసుకుంటున్న సందర్భంలో తన కూతురు 'నాన్నా...! నా బొమ్మల్ని తీసుకెళ్లండి' అంటూ ఇచ్చేసింది. ఆ విషయం ఆయన్ను కదిల్చివేసింది. పిల్లలు తమ ప్రాణంగా చూసుకునే బొమ్మల్ని వేరే వాళ్లు ముట్టుకుంటేనే అల్లాడిపోతారు. అలాంటిది తన కూతురు మొత్తానికే ఇచ్చేయడం ఆయన్ను ఆలోచనలో పడేసింది. అంతటి ప్రభావం సిరియా యుద్ధ సంక్షోభానిది. అంతటి సంక్షోభంలో కొద్ది పాటి సంతోషాన్ని చిన్నారులకు మిగిల్చాయి రామీ అందించిన బొమ్మలు. ఆ నవ్వులు చూసే 80 కేజీల బొమ్మల సంచిని తగిలించుకుని మళ్లీ మళ్లీ ముళ్ల కంచెల్ని దూకేశాడు. మళ్లీ తన ఆరుగురు కన్నబిడ్డల్ని చూస్తానన్న నమ్మకం ప్రతి ప్రయత్నంలోను ఉండేది కాదు. అయినా ఆ విషయం... కూతురికి నాన్నను హీరోను చేస్తుంటే, తన కూతుళ్లలాంటి వందలాది మంది చిన్నారుల కన్నీరు తుడుస్తుంటే ప్రాణాలు లెక్కలోకి వస్తాయా? సిరియా చిన్నారులు మృత్యువును, అభద్రతను, హింసను, ఆకలిని, జీవచ్ఛవపు బతుకుల్నే చూస్తున్నారు. అంత హృదయవిదారక పరిస్థితుల్లో ఓ బొమ్మ మేజిక్ చేసినట్టు చిరునవ్వును తెప్పిస్తుంటే ఎలా ఒక్క ప్రయత్నంతో ఆగిపోతాడు? అందుకే బొమ్మలు చాలా చాలా ముఖ్యం. ఆహారం, మందులంత ముఖ్యం. ఆత్మీయులు, స్నేహితులంత ముఖ్యం.. అంటాడు రామీ. కొంతకాలానికే 'టాయ్ స్మగ్లర్', 'శాంటా ఆఫ్ సిరియా'గా పేరొచ్చేసింది. కానీ చిన్నారులకు మాత్రం 'బొమ్మల మామయ్య'గానే బాగా తెలుసు. ఇప్పటి వరకు ఫిన్‌ల్యాండ్‌లోని హెల్సింకీ నుంచి సిరియాలోని అలెప్పోకి 28 సార్లు బొమ్మల్ని మోసుకెళ్లాడు. యుద్ధ పరిస్థితులు ముగిసేంత వరకు ఈ ప్రయాణాలు ఆపనని చెబుతున్నాడు. రెండేళ్ల క్రితం టర్కీ సరిహద్దు నిలిపివేశాక అక్రమంగా చొరబడుతున్నాడు. కాలి బాటనే యుద్ధ ప్రాంతాల్ని దాటుతున్నాడు. రెబెల్స్, ప్రభుత్వం ఆధీనంలో ఉన్న ఆ ప్రాంతాలన్నీ తీవ్ర సమస్యాత్మకమైనవే. నిత్యం బాంబుల మోతతో దద్దరిల్లేవే. తూటాల చప్పుడుకు విరామం లేనివే. తప్పదు ఎందుకంటే చాలా మంది చిన్నారులకు మంచి బొమ్మల్ని మోసుకొస్తానని మాటిచ్చాడు కనుక. రామీ ఉనికి, ప్రభావం తెలుసుకున్న ఐసిస్, షియా మిలీషియాల హిట్‌లిస్ట్‌లో వాంటెడ్‌గా మారాడు. వారి బెదిరింపుల్ని, దాడి యత్నాల్ని పట్టించుకోకుండా ఈ శాంటా వందల మైళ్లు పసి నవ్వులకై వడివడిగా కదిలిపోతున్నాడు. ప్రతిసారి వేయి బొమ్మల్ని తీసుకెళ్లేలా చూసుకుంటున్నాడు. టెడ్డీ బేర్‌లు, బార్బీ బొమ్మలు, జంతువులు, సూపర్ హీరోల బొమ్మలు ఇలా తన సేకరణలో ఏవి బాగుంటే వాటిని తీసుకెళ్తాడు. నిధుల్ని పోగు చేసి శరణార్థులకు విద్యాలయాల్ని కట్టించే కార్యాన్ని తలకెత్తుకున్నాడు. సిరియాలో ఇంత బీభత్సం జరుగుతున్నా కూడా బయటి ప్రపంచం అంటీ అంటనట్టు ఉండటాన్ని ఆయన భరించలేకపోతున్నాడు. ఇంకా ఎంత విధ్వంసం జరిగితే కానీ ప్రపంచం స్పందించదా..అని ఆవేదనతో నిలదీస్తున్నాడు. కన్నీటిని తుడుచుకుంటూనే తనవంతు ఓ చిన్ని ప్రయత్నాన్ని చిట్టి తల్లుల కోసం చేస్తున్నాడు. రామీ కూతురు ఈ సారి తండ్రి భుజం మీద తలవాల్చినపుడు ఇంకాస్త ప్రశాంతంగా నిదురోతుంది. ఎందుకంటే ఆ భుజాలు ఆ చిన్నారి లాంటి వేలాది పసి హృదయాల్ని తేలిక పరిచాయిగా..!



కూతురుతో రామీ

– అనన్య

ఇండెక్స్

స్ఫూర్తి........3
పీహెచ్‌డీలకు గైడ్
స్టార్........4
నా పేరు యాండ్రియా
నవ్వుల్ పువ్వుల్......... 5
వింత లోకం...........10
పెన్ పైనాపిల్ యాపిల్ పెన్
కవిత్వమ్..................14
లోపల.. బయట
విజేత............... 15
టెన్నిస్ యువరాణి

సమతా రాజ్యం
సాంస్కృతిక వికాసం..

అట్టమీది కథ...6

వివరం - 12
జనం పదం,పాదం
కలిస్తే..జానపదం

కథ 16
ఒసే తువాలు అందుకో
తెలుసా....................19
ఎఱ్ఱ బంగారం
రుచి....................21
కొరమేను చేపల పులుసు
బాల నేస్తాలు............23
పాంగొలిన్
పద వికాసం.....
....24

బా.. బా.. బ్లాక్‌మనీ

ఈ వారం స్నేహలో ఇచ్చిన కవర్ స్టోరీ బా...బా బ్లాక్ మనీ గురించి మాకు తెలియని ఎన్నో కొత్త విషయాలు తెలుసుకున్నాము. 2014 ఎన్నికల్లో నల్లధనం గురించి పెద్ద ఎత్తున ప్రచారం చేసిన రాజకీయ పార్టీలు నేడు ఏరు దాటిన తరువాత తెప్ప తగలబెట్టిన రీతిలో వ్యవహరిస్తున్నాయి. 145 డిగ్రీల స్టూడెంట్ నెంబర్ వన్ గురించి చదివి ఆశ్చర్యపోయాము. విశ్వ కవి శాంతినికేతన్ గురించి మంచి సమాచారం అందించారు. చీకటిలో చిరుదీపం కథ చాలా బాగుంది. నవ్వుల్ పువ్వుల్‌లో జోక్స్ మమ్మల్ని అలరిస్తున్నాయి.

- మార్టూరు అజయ్ కుమార్, చిలకలూరిపేట

స్టూడెంట్ నెంబర్ వన్

145 డిగ్రీల స్టూడెంట్‌నంబర్-1 పార్థివన్ గురించి చదివి ఆశ్చర్యపోయాం. రైతమ్మల గెలుపు కథలు స్ఫూర్తిదాయకంగా ఉన్నాయి. కవిత్వమ్ చదివింపజేసింది. శ్రమజీవుల జీవన విధానాన్ని చక్కగా ఆవిష్కరించారు.

- నీలిమ సుబ్బిసెట్టి, రాజానగరం

పవర్‌బిల్డర్

బాడీబిల్డింగ్‌లో భారత్ తరపున స్వర్ణాలు

సాధించిన ఒకే ఒక్క క్రీడాకారుడు ముకేశ్ గురించి ఇచ్చిన వివరాలు అకట్టుకున్నాయి. బాడీబిల్డింగ్, పవర్‌లిఫ్టింగ్‌లో సత్తాచాటుతూ తనలాంటి బిడ్డల్ని తయారు చేస్తున్న ముకేశ్‌కు హ్యాట్స్ ఆఫ్. కదిలే బొమ్మల కథల విశేషాలు బాగున్నాయి. శాంతినికేతన్‌లో ఒక రోజు పాత జ్ఞాపకాలను గుర్తుచేసింది. తీన్ పహాడ్, నీహారికా ఆర్ట్ గ్యాలరీ, రవీంద్ర మ్యూజియం వివరాలతో పాటు, చక్కటి చిత్రాలతో శాంతినికేతన్‌ని కళ్లకు కట్టినట్లు చూపించిన స్నేహ అనుబంధానికి ధన్యవాదాలు.

- అర్పిత, అనంతపురం

రైతమ్మల గెలుపు కథలు

వాతావరణ మార్పులతో కుదేలవుతున్న వ్యవసాయరంగాన్ని సంక్షోభం నుండి బయటపడేలా రైతమ్మలు డాక్యుమెంటరీలు, కమ్యూనిటీ రేడియోల ద్వారా చేస్తున్న కృషి అభినందనీయం. 145 డిగ్రీలు పూర్తిచేసిన పార్థివన్ విశేషాలు విస్మయానికి గురిచేశాయి. అట్టమీది కథ బాబా...బ్లాక్ మనీలో నల్లధనంపై చక్కని సమాచారం అందించారు. ఆవాలూ హూ, రాగ ఎవరాప్టర్, బస్తర్ బార్దా, మనిషిది ప్రకృతిదీ ఓ ఆత్మీయ బంధం కవిత, చీకటిలో చిరుదీపం కథ, నవ్వుల్ పువ్వుల్ బాగున్నాయి.

- ఎన్.వెంకటేశ్వరరావు, ఒంగోలు

అబుధాబి విశేషాలు బాగున్నాయి

ఈ వారం స్నేహలో ప్రచురించిన విషయాలు ఆకట్టుకున్నాయి. మన దేశానికి 3000కి.మీ దూరంలో ఉన్న అబుధాబి గురించిన విశేషాలు ఆసక్తిదాయకంగా ఉన్నాయి. వ్యాసకర్త కళ్లకు కట్టినట్లు వర్ణించిన తీరు బాగుంది. 90 శాతం ఖర్జూరం చెట్లు, ప్రపంచంలో అత్యంత ముఖ్యమైన షేక్ జాయద్ గ్రాండ్ మసీదు వివరాలు ఆసక్తిని గొలిపే విధంగా ఉన్నాయి. పర్యాటక కేంద్రంగా అబుధాబి గురించి అనేక అంశాలు తెలియజేసిన తీరు బాగుంది.

- జటావల్లభుల సాయిరాం, కైకరం

సంచికపై మీ అభిప్రాయాలను పంపాల్సిన చిరునామా: స్నేహ, ప్రజాశక్తి, డోర్ నెం: 27-30-4, ఆకుల వారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ.-520002.
మెయిల్ అడ్రస్: snehaweekly.praja@gmail.com

స్ఫూర్తి

పీహెచ్‌డీలకు గైడ్



మధ్యప్రదేశ్ అశోక్ నగర్‌లోని చన్దేరీ ప్రాంతంలో ముజఫర్ అన్సారీ (కల్లే భాయ్) పేరు తెలీనివారుండరు. విదేశీ పర్యాటకులకు తనో మంచి టూరిస్ట్ గైడ్. పరిశోధన విద్యార్థులకు రీసెర్చ్ గైడ్. స్థానికులకు రోల్ మోడల్. ఆర్థిక ఇబ్బందుల వల్ల ఆరో తరగతితో చదువుకు దూరమైనా ఆ తర్వాత స్వయం సాధనతో పీహెచ్‌డీ విద్యార్థులకు గైడెన్స్ ఇచ్చే స్థాయికి ఎదిగాడు. చరిత్రను లోతుగా తెలుసుకున్న కల్లే భాయ్ గ్రామంలోని 20కి పైగా పీహెచ్‌డీ విద్యార్థులని గైడ్ చేస్తున్నాడు. బెంగాలీ, గుజరాతీ, పంజాబీ, ఇంగ్లీష్ భాషలను అనర్గళంగా మాట్లాడడంతో పాటు క్యారికేచర్, చిత్ర కళ, నాణేల సేకరణ ఇలా అనేక అభిరుచులతో తన ప్రతిభని చాటుకుంటున్నాడీ బహుముఖ ప్రజ్ఞాశాలి.

కొత్త విషయాలని తెలుసుకోడమంటే కొందరికి చాలా ఇష్టం. తెలుసుకున్న విషయాలని ఇతరులతో పంచుకోవడం మరికొందరి హాబీ. ఈ కోవకి చెందిన వ్యక్తే ముజఫర్ అన్సారీ (55). ఎప్పటికప్పుడు బుర్రకి పదును పెడుతూ ఏదో ఒక కొత్త సమాచారాన్ని తెలుసుకుంటాడు. తెలుసుకున్న వాటిపై పరిశోధన మొదలెట్టేస్తాడు. ఈ పరిశోధనలే చరిత్రలో పీహెచ్‌డీ పరిశోధన చేస్తున్న విద్యార్థులకి ఆయన్ను గైడ్‌ని చేసాయి. 'గైడ్' అంటే మార్గనిర్దేశకుడని అర్థం. ప్రస్తుతం కల్లేభాయ్ వృత్తి ప్రవృత్తి రెండూ మార్గ నిర్దేశకత్వంతోనే ముడిపడ్డాయి. ఓ కెమోఫ్లేజ్ క్యాప్, డైరీతో కల్లేభాయ్ ప్రయాణం మొదలవుతుంది. టూరిస్ట్ గైడ్‌గా మధ్యప్రదేశ్‌లోని అణువణువు తిరిగిన కల్లే భాయ్ కొత్తగా తెలుసుకున్న ప్రతి విషయాన్నీ ఆ డైరీలో నోట్ చేసుకుంటాడు. అవే కాదు తన గ్రామంలో శిల్ప కళ, హస్త కళ, ముద్రణా వృత్తుల్లో ఉన్న వారి పేర్లు, చిరునామాలను సేకరించి వాటిని హిందీలో రాసుకుంటాడు. తీరిక దొరికినప్పుడు వాటిని బెంగాలీ, పంజాబీ (గుర్ముఖి) భాషల్లోకి తర్జుమా చేస్తుంటాడు. కొత్తగా నేర్చుకున్న భాషలపై పట్టు సాధించడానికి ఇదొక చక్కని సాధన. ఇవే కాదు గుజరాతీ, బ్రాహ్మీ, ఉర్దూ, ఇంగ్లిష్ భాషలని అనర్గళంగా మాట్లాడేస్తుంటాడు కల్లే భాయ్. 1935 నుండి భారత ఆర్‌బిఐ గవర్నర్లుగా పనిచేసిన వారి వివరాల్ని సేకరించడం, చన్దేరీ సాంప్రదాయ వంటకాల తయారీ విధానం, అరుదైన మూలికలు, మందుల పేర్లు, ప్రయాణాలకి సంబంధించిన విషయాలు, బంధు మిత్రుల వివరాలు ఇలా ఒక్కొక్కటిగా తన హాబీలన్నీ ఒక్కో భాషలో తన డైరీలో చేరిపోయాయి. నాణేల సేకరణ కూడా కల్లేభాయ్ అభిరుచిలో భాగమైంది. కేవలం నాణేలని సేకరించి తన పని ముగించలేదు, ప్రతి నాణేనికి వాటి కాలం, ఏ వంశస్తులు వాటిని ఎలా ఉపయోగించారనే పూర్తి సమాచారం సేకరించాడు. వీటితోపాటు 10వ శతాబ్దం నాటి నాణేలను కూడా మనం ఇతని వద్ద చూడొచ్చు. క్యాలిగ్రఫి, పెయింటింగ్‌లో అనుభవాన్ని గడించిన కల్లేభాయ్ చన్దేరీ ప్రాంతానికి వచ్చే పర్యాటకులకు పోస్టు కార్డులపై వారి పేరును అందంగా తీర్చిదిద్ది బహుమతిగా అందిస్తాడు. పెయింటింగ్‌ని ముప్పై ఏళ్ల క్రితం నేర్చుకున్నా ఇప్పటికీ వాటిపై సాధన కొనసాగుతూనే ఉంది. చన్దేరీ గ్రామంలో కల్లే భాయ్‌కి తెలిసన్ని విషయాలు మరెవరికీ తెలీవు. ఇలా అన్ని రంగాల్లో అనుభవాన్ని గడించాడు కాబట్టే కల్లేభాయ్‌ని గ్రామస్థులందరూ ప్రజ్ఞావంతుడంటారు. ఆ ప్రజ్ఞే పీహెచ్‌డీ విద్యార్థులకు గైడ్‌ను చేసింది. అతను చదివింది ఆరో తరగతే అయినా కొత్త విషయాలని తెలుసుకోవాలనే అభిరుచి, పట్టుదలే తనకి కొత్త జీవితాన్నిచ్చాయంటాడు కల్లేభాయ్.

తెలీకుండానే...

ఆర్థికంగా వెనుకబడిన కుటుంబంలో పుట్టిన కల్లేభాయ్‌కి చదువంటే ఇష్టం. పుస్తకాలు, చిన్న చిన్న ఖర్చుల కోసం కుటుంబానికి భారం కాకుండా వేసవి సెలవుల్లో పని చేస్తూ డబ్బు సమకూర్చుకునే వాడు. ఆరవ తరగతిలో స్కూల్ ఫీజు కట్టలేకపోవడంతో కల్లేభాయ్ పూర్తిగా చదువు మానుకోవాల్సి వచ్చింది. అప్పటి నుంచే కొత్త విషయాలని తెలుసుకుంటూ విజ్ఞానాన్ని పెంచుకోవడం ప్రారంభించాడు. కుటుంబ పోషణ కోసం చిన్న చిన్న ఉద్యోగాలు చేస్తూనే కొత్త విషయాలపై శోధనని కొనసాగించే వాడు. కొన్నేళ్ల క్రితం చన్దేరి ప్రాంతానికి రీసెర్చ్ వర్క్ కోసం వచ్చిన కొందరు విద్యార్థులు పొరపాటుగా వారు కలవాల్సిన గైడుని కాకుండా కల్లేభాయ్‌ని కలుసుకున్నారు. అప్పటికి తనకి టూరిస్ట్ గైడుగా అనుభవం లేకపోయినా చన్దేరీ ప్రాంతంలోని అణువణువూ తెలిసుండడంతో వారికి ఎంతగానో సాయపడగలిగాడు. అప్పటి నుండి కొత్త భాషలు నేర్చుకోవడం ప్రారంభమైంది. ఈ మధ్యే బ్రోకెన్ ఫ్రెంచ్‌లో సంభాషణలు చేస్తున్నాడట. ప్రపంచవ్యాప్తంగా వచ్చే వందలాది పర్యాటకులకు తన సేవలందిస్తూ వారి అభిమానాన్ని పొగేసుకుంటున్నాడు. మధ్యలో ఆగిపోయిన చదువుని ప్రైవేటుగా పూర్తిచేస్తూ ప్రస్తుతం చరిత్ర విభాగంలో పీహెచ్‌డీకి సిద్ధమవుతున్నాడు కల్లేభాయ్. సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంచుకుంటూ వైజ్ఞానిక సాధికారత కోసం చన్దేరీ ప్రాంతంలో ఏర్పాటు చేసిన డిఇఎఫ్ (డిజిటల్ ఎమ్‌పవర్‌మెంట్ ఫౌండేషన్) ప్రాజెక్టుకి సమగ్ర సభ్యుడిగా పనిచేస్తున్నాడు కల్లేభాయ్.

– శారద

నా పేరే యాండ్రియా

యాండ్రియా పేరు వినగానే మనకు గుర్తుకొచ్చేది నటిగానే. కానీ ఆమె పాపులర్ సింగర్, డ్యాన్సర్ అన్న విషయం చాలా తక్కువ మందికే తెలుసు. సైకోథెరపిస్ట్ కావాలనుకున్న యాండ్రియా జెరెమయ్యాకు సృజన రంగంపై చిన్నతనంలోనే ఆసక్తి కలిగింది. అలా గాయనిగా, నటిగా దక్షిణాది చిత్ర సీమలో రాణిస్తోంది.

- యాండ్రియా చెన్నైలో రోమన్ క్యాథలిక్ కుటుంబరలో పుట్టింది. విద్యాభ్యాసం మొత్తం అక్కడే పూర్తి చేసింది.
- ఎనిమిదేళ్ల వయస్సులోనే పియానో నేర్చుకోవటం ప్రారంభించింది యాండ్రియా. పదేళ్లకే నటనపై ఆసక్తి పెంచుకుంది. కాలేజీ రోజుల్లోనే సినీ అవకాశం వచ్చింది. కానీ చదువు పూర్తి చేయడం కోసం ఆ అవకాశాన్ని వదులుకుంది.
- కానీ సంగీతం మీద పిచ్చి ఆమెను ఎక్కువ కాలం దూరంగా ఉండనీయలేకపోయింది. జాక్సన్-5 బృందంలో గాయనిగా చేరింది. ఆ తర్వాత నేపథ్య గాయనిగా సినిమాల్లో అవకాశాలు వచ్చాయి.
- తన విలక్షణ గాత్రంతో ప్రేక్షకుల మనసు దోచుకున్న యాండ్రియా దక్షిణాది చిత్రాల్లో ఎన్నో పాటలు పాడింది. తను మద్రాస్ ప్లేయర్స్, అవం ఆర్గనైజేషన్‌లో అనేక ప్రదర్శనలిచ్చింది.
- 2005 నుంచి డబ్బింగ్ ఆర్టిస్ట్‌గా మరో రంగంలోకి అడుగుపెట్టింది. కమలినీ ముఖర్జీ, తాప్సీ, ఇలియానా వంటి అగ్రతారలకు గొంతుకనిచ్చింది.
- ఆమె తెలుగులో తడాఖా చిత్రంలో 'నందు' పాత్రలో నటించింది. తెలుగులో ప్రముఖ చిత్రాల్లో నా పేరే మల్లీశ్వరి (సయ్యాట), వీ హ్యావ్ ఎ రోమియో (బొమ్మరిల్లు), జర జరా.. (రాఖీ), గిలి గిలిగా... (దేశ ముదురు), నేను నీ రాజా... (కింగ్), దివాలీ దీపాన్ని (దడ), ఓయె.. ఓయె.. (ఎవడు) తదితర పాటల్ని దేవీశ్రీ ప్రసాద్ కంపోజింగ్‌లో హుషారెత్తించేలా పాడింది.
- ఆమె తన రంగ స్థల జీవితాన్ని గిరీష్ కర్నాడ్‌తో ప్రారంభించింది. గౌతమ్ మీనన్‌తో కలసి 'వెటైయాడ్ వెలైయాడ్' అనే పాటను పాడింది. గౌతమ్ 'పాచైకిలి ముత్తుచరమ్' అనే చిత్రంలో స్త్రీ పాత్ర పోషించాలని కోరారు. జేమ్స్ సీగల్ రచించిన నవల 'డిరైయిల్డ్' ప్రేరణతో రూపుదిద్దుకున్న కథలో ఓ విలక్షణ పాత్ర అది. ఆ పాత్రకు అంతకు ముందు సిమ్రాన్, శోభన, టబును అనుకున్నారు. చివరకు యాండ్రియా ఎంపికైంది.
- ఆమె నటించిన ఫాంటసీ చిత్రం 'ఆయిరాత్రిల్ ఒరువన్' తెలుగులో 'యుగానికొక్కడు'గా 2011లో విడుదలైంది. సహాయ నటిగా చేసిన మల్టీ స్టారర్ 'మనకళ' చిత్రం ఆగస్టు 2011 లో విడుదలైంది. 2013లో రాజీవ్ రవి చిత్రం 'అన్నయుమ్ రసూలమ్' చిత్రం తన తొలి మలయాళ చిత్రం. ఆమె కెరీర్‌లోనే ఇది ఉత్తమ చిత్రంగా నిలిచింది.
- ఆమె అనేక ఫిలింఫేర్, విజయ్ అవార్డులను అందుకుంది.
- ఇటు సినిమాల్లో బిజీగానే ఉంటూ అటు సంగీత రంగంలో తన మార్క్ వేసుకుంది. 2009లో యాండ్రియా 'సంఘర్ష్' కచేరి చేసింది.
- ఆమె కమల్ హాసన్‌తో కలసి నటించిన 'విశ్వరూపం' దక్షిణాది రాష్ట్రాల్లో తెలుగు, తమిళం, హిందీ భాషల్లో సంచలనం సృష్టించింది. 'ఓర్ మురై' విడుదలయ్యాక ప్రస్తుతం 'హౌస్ నెక్స్ట్ డోర్' అనే సినిమా తెలుగు, తమిళం, హిందీ, మలయాళం భాషల్లో చిత్రీకరణ జరుగుతోంది.
- యాండ్రియాను ఇంట్లో ముద్దుగా యాన్ అని పిలుస్తారు.
- ఆమెకు ఇంగ్లీషు, మలయాళం, తమిళ భాషలు బాగావచ్చు.

- కుమారి ఎన్

నవ్వుల్ - పువ్వుల్

శ్వేత: ఏమండి మీకు నేనంటే లెక్కలేకుండా పోతోంది..నేను చెప్పేదేదీ పట్టించుకోవడం లేదు.
శ్రీను: నీ మాటకి నేనెంత విలువిస్తానో తెలుసా..
శ్వేత: ఎంత?
శ్రీను: నేనొక మొబైల్ అయితే నువ్వొక సిమ్ అంత..!
శ్వేత: నిజంగానా....మీరెంత మంచివారో
శ్రీను: దీనికి తెలీదు.... నాది డ్యూయల్ సిమ్ అని.

చెవులకి చిల్లు

రమేష్: సెకండ్ హ్యాండ్ స్కూటర్ అయినా అంతా బాగానే ఉంది కానీ హారన్ మోగట్లేదేంటి?
మెకానిక్: తీసేసాను సార్
రమేష్: నీకేమైనా పిచ్చా...ఎందుకలా చేశావ్
మెకానిక్: ఆ స్కూటర్ నుండి వచ్చే సౌండ్ చాలదా! ప్రత్యేకంగా హారనెందుకని.



శంఖంలో పోస్తేగానీ...

డాక్టర్: తాగుడు మానటానికి టానిక్ ఇచ్చాను కదా రోజుకు ఎన్ని సార్లు తీసుకుంటున్నావు?
దేవదాసు: రోజుకు రెండు పెగ్గుల చొప్పున డాక్టర్.



అంతా మన చేతుల్లోనే

పిల్ల తండ్రి: అబ్బాయి సూపర్ మ్యాన్‌లా ఉన్నాడు కదమ్మా!
అమ్మాయి: పర్వాలేదు నాన్నా పెళ్లయ్యాక నాకు వీలుగా 'వాచ్‌మెన్‌లా' మార్చుకుంటాలే!

కల నిజమే

లెక్చరర్ నెం1: ఈ మధ్య నేను కన్న కల నిజమైంది తెలుసా?
ఏంటది ఉత్సాహంగా అడిగాడు లెక్చరర్ నెం 2
లెక్చరర్ నెం1: నేను క్లాసులో పాఠం చెబుతున్నట్టు కలొచ్చింది. తీరా మెలకువ వచ్చి చూస్తే నేను నిజంగానే క్లాసులో ఉన్నాను ఆశ్చర్యంగా.

చీమ ప్రతాపం



రెండు చీమలు బాగా మందు కొట్టి ఒక ఏనుగు దగ్గరకు వెళ్ళాయి.
మొదటి చీమ: మా వాడిని ఏదో అన్నావట. కాలితో ఒక్క తన్ను తన్నానంటే థాయ్‌ల్యాండ్‌లో పడతావ్.
రెండో చీమ: పోనీ లేవోయ్..... వాడొక్కడు మనం ఇద్దరం! ఈ సారికి వదిలేయ్......

మతిమరుపు

వెంగళప్ప : నీ నెత్తి మీద దట్టంగా వెంట్రుకలుండేవి. ఇప్పుడు బట్టతల. చాలా లావుగా ఉండేవాడివి. ఇలా ఎముకలు తేలేలా సన్నబడ్డావు నీలో ఎంత మార్పు వచ్చింది సుబ్బారావ్.....
అప్పారావ్: నా పేరు సుబ్బారావ్ కాదు. అప్పారావ్...
వెంగళప్ప : చివరికి పేరులో కూడా మార్పు వచ్చిందన్న మాట.



స్నేహ తన స్నేహితుడు చింటుతో...
మీ నాన్న పేరేంటి?
చింటు : గూగుల్ కుమార్
స్నేహ: అదేం పేరు?
చింటు: నేనూ, మా తమ్ముడూ ఆడుకోవడానికి ఎక్కడికి వెళ్లినా వెతికి ఇంటికి పట్టుకొస్తాడు. (కోపంగా)...

ఏ రాయయితే ఏంటి

పద్మనాభం: నీకు కలిసొచ్చిన 'రాయి' పేరు చెప్పమంటే బండరాయి అంటావేంట్రా? పిచ్చెక్కిందా...
గురునాథం: అదృష్టం ఏ రాయితో వస్తే ఏం?........ పచ్చడి బండ తగిలే కదా మా మామ మంచానికి అతుక్కుంది. స్నేహితుడి వైపు ఆశ్చర్యంగా చూస్తూ చెప్పాడు...

ఆ మాత్రం తెల్దా

కొడుకు: నాన్న 5+5 ఎంత?
ప్రసాదరావు: చచ్చు దద్దమ్మా....... తెలివి తక్కువ వెధవా ఆ మాత్రం తెలియదా... నా టేబుల్ మీద క్యాలిక్యులేటర్ ఉంది పట్రా....చెబుతాను.

సమతా రాజ్యం.. సాంస్కృతిక వికాసం...

సెయింట్ పీటర్స్ బర్గ్

- ఎస్. వెంకట్రావు

విప్లవాలు ప్రజల ఆర్థిక, సామాజిక పరిస్థితుల్లోనే కాదు కళా సాంస్కృతిక జీవనంలో కూడా గొప్ప మార్పులు తీసుకువస్తాయి. అప్పటివరకు పాత సామాజిక వ్యవస్థ కింద అణచివేయబడుతూ వస్తున్న శక్తులు విప్లవానంతరం స్వేచ్ఛ పొందుతాయి. వాటి సృజన కట్టలు తెంచుకుంటుంది. సాంస్కృతిక వికాసం జరుగుతుంది. కళలు, సాహిత్యం, భావాలు కొత్త పుంతలు తొక్కుతాయి. ఇది ఆయా దేశాలకే పరిమితం కాదు. ప్రపంచవ్యాప్త ప్రభావం కలుగజేస్తుంది. ఫ్రెంచ్ విప్లవం, అమెరికన్ విప్లవం యూరప్, అమెరికా ఖండాల్లో మహత్తర మార్పులు తీసుకువచ్చాయి. వాటి ప్రభావం ప్రపంచంపై గణనీయంగా పడింది. అలాగే రష్యన్ అక్టోబర్ విప్లవం, దాని వల్ల నెలకొల్పబడిన తొలి కార్మిక వర్గ రాజ్యం రష్యాలోనూ, నాటి సోవియట్ రిపబ్లిక్కుల్లోనూ గొప్ప సాంస్కృతిక మార్పులు తీసుకువచ్చింది. ఐరోపాలో అత్యంత వెనుకబడిన రష్యా... అక్టోబర్ కార్మికవర్గ విప్లవం తరువాత ఆర్థిక, శాస్త్ర, సాంకేతిక రంగాల్లోనే కాకుండా కళా, సాంస్కృతిక రంగంలో కూడా కొత్త వికాసాన్ని పొందింది. బోల్షివిక్ విప్లవ శత వార్షికోత్సవం సందర్భంగా దాన్ని గురించి రేఖామాత్రంగా తెలుసుకుందాం.

రష్యన్ అక్టోబర్ విప్లవం (1917) తరువాత ఏర్పడిన సోవియట్ యూనియన్‌లో కళా సృజన కొత్త పుంతలు తొక్కింది. కళలు, సాహిత్యం, క్రీడల్లో ఆ దేశం అనతి కాలంలోనే ప్రపంచ అగ్రగామిగా మారింది. కార్మిక వర్గ రాజ్యం కళా సాహిత్యాలను ప్రోత్సహించే అనేక యూనివర్సిటీలు, పాఠశాలలు, స్టూడియోలు, మ్యూజియంలు, గ్యాలరీలనూ, నాటకాలు, ఒపేరాలు ప్రదర్శించే థియేటర్లనూ, క్రీడా సదుపాయాలనూ నిర్మించడంతో వేల సంఖ్యలో కొత్త కళాకారులు, రచయితలు, గృహ నిర్మాణ కళా నిపుణులు (ఆర్కిటెక్ట్‌లు) పుట్టుకొచ్చారు. విప్లవం నిర్మించిన కొత్త ప్రపంచంలో వీరంతా సరికొత్త భాగస్వాములైనారు. 1917 నుండి 1932 వరకు సోవియట్ యూనియన్‌లో కొత్త కొత్త కళా సాంస్కృతికోద్యమాలు నడిచాయి. రష్యన్ 'అవంత్ గార్డ్'గా పిలిచే ఈ కళాకారుల ఉద్యమం వాస్తవానికి విప్లవానికి ముందే ప్రారంభమైనా విప్లవానంతరం ఉరుకులు పరుగులతో పయనించింది. ఈ కాలంలో సుప్రిమాటిజం, కన్‌స్ట్రక్టివిజం, ఫ్యూచరిజం, క్యూబో-ఫ్యూచరిజం, జావుమ్, నియో-ప్రిమిటివిజం వంటి అనేక ఉద్యమాలు అభివృద్ధి చెందాయి. చిత్రలేఖనం, డిజైనింగ్, చలనచిత్ర నిర్మాణం, జర్నలిజం, సంగీతం, భవన నిర్మాణం, నాటక రంగం...ఇంకా అనేక రంగాల్లో ఈ కొత్త ఉద్యమాలు బయలుదేరాయి. వందల సంఖ్యలో అవంత్ గార్డ్ చిత్రకారులు, డిజైనర్లు అభివృద్ధి చెందారు. వీరిలో ఎక్కువ మంది ఉక్రెయిన్, బెలోరష్యాలకు చెందినవారు. రచయితల్లో మయకోవ్‌స్కీ, ఆంద్రీ బెలీ, ఎలీనా గూరో, సినిమా దర్శకుల్లో 'బ్యాటిల్‌షిప్ పొటమ్కిన్' తీసిన సెర్గీ ఐసెన్‌స్టీన్, పుడోవ్‌కిన్ (మోంటేజ్ పద్ధతిని కనిపెట్టారు) ఇంకా అనేకమంది సుప్రసిద్ధులైనారు.



కుండ్రిన్కా డ్యాన్స్ గ్రూప్

సోషలిస్టు వాస్తవిక వాదం

అక్టోబర్ విప్లవానంతరం సోషలిస్టు సోవియట్ యూనియన్ అనేక సవాళ్లు ఎదుర్కొన్నది. మొదటి ప్రపంచ యుద్ధంలో శత్రువులుగా పోరాడుకున్న దేశాలు కూడా ఏకమై శైశవ కార్మిక రాజ్యంపై దండెత్తాయి. 18 పశ్చిమ దేశాలు సోవియట్‌పై దాడి చేయడంతోబాటు అంతర్గత విప్లవ ప్రతీఘాత శక్తులను ప్రోత్సహించాయి. ఆర్థిక ఆంక్షలు

విధించాయి. 1924లో అంతర్యుద్ధంలో జయించిన తరువాత స్టాలిన్ నాయకత్వంలో సోవియట్ యూనియన్ పంచవర్ష ప్రణాళికల ద్వారా శీఘ్రాభివృద్ధి సాధించింది. ఎంత అభివృద్ధి అంటే... విప్లవ కాలం నాటికి దేశ ప్రజల్లో 80 శాతం మంది నిరక్షరాస్యులు. దేశం మొత్తం మీద 90 ఉన్నత విద్యా సంస్థలు మాత్రమే ఉండేవి. అందులో 1.12 లక్షల మంది విద్యార్థులు మాత్రమే చదివేవారు. అటువంటిది 1928లో ప్రారంభమైన మొదటి పంచవర్ష ప్రణాళిక 1932 చివరిలో ముగిసే సరికి పారిశ్రామిక రంగంలో అమెరికా తరువాత సోవియట్ యూనియన్ రెండవ స్థానంలోకి వచ్చింది. 1936 నాటికి దేశం మొత్తాన్ని విద్యుద్దీకరించింది. మూడు పంచవర్ష ప్రణాళికలు ముగిసే సరికి దేశంలో కార్మికుల సంఖ్య 46 లక్షల నుండి 1 కోటి 26 లక్షలకు పెరిగింది. 1930వ దశకంలో పశ్చిమ దేశాలు తీవ్ర ఆర్థిక మాంద్యంలో కూరుకుపోయి వుంటే తొలి కార్మిక రాజ్యం సోషలిస్టు విధానాలతో శరవేగంతో ముందుకు వెళ్లింది.

'అమ్మ' నవల ఒరిజినల్ టైటిల్

అవంత్ గార్డ్ అంటే...

అవంత్ గార్డ్ అనేది ఫ్రెంచ్ పదం. దానర్థం 'అగ్రగామి రక్షకుడు' లేదా 'అగ్రగామి' అని. ప్రయోగాత్మక, విప్లవాత్మక, అమలులో ఉన్నదానికి భిన్నమైన కళారూపాలను, సాంస్కృతిక రూపాలను రూపొందించేవారినీ, వారి సృజనలను అవంత్ గార్డ్ అని పిలుస్తారు. సాంస్కృతిక రంగంలో స్థిరపడిన ప్రతిదాని స్థానంలో కొత్తదాన్ని సృష్టించడమే అవంత్ గార్డ్ ప్రత్యేకత. ఆధునిక వాదానికి ఇది కొలబద్ధ అని చెబుతారు. అయితే ఆధునికానంతర వాదానికి ఇది భిన్నమైనది. డాడాయిజం నుండి ఆధునికానంతర వాదుల వరకు చాలా మంది తమను తాము అవంత్ గార్డ్ ఉద్యమకారులుగా చెప్పుకుంటారు. అవంత్ గార్డ్ ఉద్యమం సమూల సామాజిక మార్పులు కోరుతుంది. "కళాకారులు ప్రజల యొక్క అగ్రగామి రక్షకులుగా ఉండాలి. సామాజిక, ఆర్థిక, రాజకీయ సంస్కరణలు తీసుకురావడానికి కళలు తక్షణం, శీఘ్రంగా ఉపయోగపడే సాధనంగా ఉండాలి" అని అవంత్ గార్డ్ అనే మాటను తన వ్యాసంలో మొట్టమొదటి సారిగా (1825) ఉపయోగించిన సెయింట్ సిమోనియన్ ఓలిండే రోడ్రిగ్స్ పేర్కొన్నారు.



ఎల్ లిసిట్జ్కీ 'బీట్ ద విషెస్ విత్ ది రెడ్ వెడ్జ్' (1919)

గోర్కీ విప్లవ 'అమ్మ'

ఈ అభివృద్ధికి అనుగుణంగానే కళా, సాంస్కృతిక రంగాల్లో మార్పులు వచ్చాయి. అంతకు ముందున్న అవంత్ గార్డ్ ఉద్యమ స్థానాన్ని క్రమంగా 'సోషలిస్టు వాస్తవికవాదం' (సోషలిస్టు రియలిజం) ఆక్రమించింది. విశ్వ విఖ్యాత రచయిత మాగ్జిమ్ గోర్కీ రాసిన 'అమ్మ' నవలను ప్రథమ సోషలిస్టు వాస్తవిక వాద నవలగా పేర్కొంటారు. ఈ నవల ప్రపంచ వ్యాపితంగా సంచలనం కలిగించింది. నవల చదివి ఎన్నో దేశాల్లో యువకులు విప్లవ పోరాటాల్లోకి ఉరికారు. సోవియట్ యూనియన్‌లో సోషలిస్టు వాస్తవిక వాదం శీఘ్రంగా అభివృద్ధి చెందడంలో గోర్కీ పాత్ర ఎక్కువ ఉంది. ఆయన 1933లో 'సోషలిస్టు వాస్తవికత' అనే పేరుతో రాసిన కరపత్రం సోవియట్ కళలకు దిశానిర్దేశం చేసింది. సాహిత్యంలో గోర్కీ 'అమ్మ' నవలతోబాటు ఫ్యోదార్ గ్లడ్‌కోవ్ రాసిన సిమెంట్, 1934లో నికొలాయ్ ఆస్ట్రోవ్‌స్కీ రాసిన 'హౌ ద స్టీల్ వజ్ టెంపర్డ్' (తెలుగులో 'కాకలు తీరిన యోధుడు'), 1934లో మిఖాయిల్ షొలొకోవ్ రాసిన 'క్వయిట్ ఫ్లోస్ ది డాన్' మొదలైనవి సాహిత్యంలో సోషలిస్టు వాస్తవిక వాదానికి అద్దం పట్టే రచనలు.

కన్‌స్ట్రక్టివిజమ్: వ్లాదిమిర్ షుఖోవ్ 'షుఖోవ్ టవర్' (1922)



సాహిత్యం ఒక్కటే కాదు డిజైనింగ్, చిత్ర రచన, సినిమాలు, నాటకాలు, ఒపేరా, బ్యాలే మొదలైన అన్ని కళా రూపాలూ సోషలిస్టు వాస్తవికవాదం ఆలంబన చేసుకుని అభివృద్ధి చెందాయి. పెట్టుబడిదారీ దేశాల్లోని వ్యక్తి వాదానికి విరుద్ధమైనది ఈ సోషలిస్టు వాస్తవికవాదం. ఇది వ్యక్తి వాదం కాదు వ్యష్టి వాదం. సోషలిస్టు సమాజంలో ప్రజల వాస్తవిక జీవితాన్ని చిత్రీకరించడం, సమిష్టిని ప్రోత్సహించడం దీని ఉద్దేశం. బోల్షివిక్ విప్లవానంతరం ప్రజల సాంస్కృతిక పునరుజ్జీవన కమిస్సార్‌గా ప్రముఖ రష్యన్ సాహిత్య విమర్శకుడు ల్యూనచరిస్కీని నియమించారు. ఆయన సోవియట్‌లో ఒక కొత్త సౌందర్య దృష్టి (ఈస్తటిక్స్)ని ప్రవేశపెట్టాడు. "ఆరోగ్యకరమైన శరీరం, మేధోవికాసం గల ముఖం, స్నేహ పూర్వకమైన నవ్వు... ఇవి మనకు జీవితాన్ని పెంచుతాయి" కనుక సోషలిస్టు వాస్తవికతలో మానవుని దేహం ఒక ప్రధాన అంశంగా ఉంటుందనేది ఆయన భావన. అందుకే ఈ కాలంలో సోవియట్ చిత్రాలు, శిల్పాలు, పోస్టర్లు, ఒపేరా, థియేటర్, సోవియట్ సర్కస్ ఇవన్నీ కూడా మనిషి యొక్క ఆరోగ్యవంతమైన, కచ్చితమై దేహ సౌందర్యానికి ప్రాధాన్యతనిచ్చాయి.

రష్యాలోని శాశ్వత సర్కస్ థియేటర్



డ్జిగా వెర్టోవ్స్ డాక్యుమెంటరీ ఫిల్మ్ 'మ్యాన్ విత్ ఎ మూవీ కెమెరా' (1929)

ఈ కాలంలోనే సోవియట్ యూనియన్‌లో కళలు కొత్త పుంతలు తొక్కాయి. సోవియట్ సర్కస్, సోవియట్ ఒపేరా, సోవియట్ నాటకాలు, జిమ్నాస్టిక్స్ ప్రపంచ ప్రసిద్ధమైనాయి. బాల

లునాచెర్స్కీ

రష్యన్ బ్యాలే



రష్యన్ బ్యాలే ప్రపంచ ప్రసిద్ధమైనది. జారు చక్రవర్తుల కాలంలోనే రష్యాలో అభివృద్ధి చెందిన బోల్షోయ్ థియేటర్ ప్రపంచ వ్యాపితంగా ప్రదర్శనలు ఇచ్చేది. రష్యన్ బ్యాలే కంపెనీలు అనేకం వెలిశాయి. అయితే ఇవన్నీ మధ్యతరగతి, ఎగువ మధ్యతరగతి ప్రజలకు పరిమితమయ్యేవే.

విప్లవానంతరం సోవియట్ ప్రభుత్వం దేశ వ్యాపితంగా బ్యాలే థియేటర్లు నిర్మించింది. అనేక శాస్త్రీయ బ్యాలే నృత్యాలు ప్రజా బాహుళ్యానికి పరిచయం చేయబడ్డాయి. విప్లవానంతరం అవంత్ గార్డ్ బ్యాలేలో కూడా ప్రవేశించింది. కొత్త కొత్త నృత్యరూపాలు, నూతన సంగీత పద్ధతులు పుట్టుకొచ్చాయి. సోవియట్ ప్రభుత్వం బ్యాలే, ఒపేరా, సింఫొనీ, నాటకాల థియేటర్లకు వెళ్లి కళాస్వాదన చేసేందుకు సామాన్య ప్రజలను ప్రోత్సహించేది. చిన్న చిన్న పట్టణాలు, గ్రామాల్లో సైతం పెద్ద ఎత్తున థియేటర్లు నిర్మించింది. దాంతో ఫ్యాక్టరీ కార్మికులు, సమిష్టి వ్యవసాయ క్షేత్రాల్లోని రైతులు పెద్ద ఎత్తున థియేటర్లకు, బృందగాన హాళ్లకు, ఒపేరా హౌస్‌లకు వెళ్లేవారు. క్రీడాకారులకు మాదిరిగానే నృత్యకారులు, నటులు, సంగీత విద్వాంసులను పాఠశాల స్థాయి నుండే అభివృద్ధి చేయడం ప్రారంభించారు. కచ్చితమైన శరీరం అనే అధికార విధానానికి అనుగుణంగానే ఇక్కడ అన్ని రకాల నృత్యకారులు, నటులు సరైన శరీర సౌష్ఠవాన్ని కొనసాగించేవారు. సోవియట్ కూలిపోయిన తరువాత సోవియట్ కళారంగంలో ప్రముఖులైన వారిని పశ్చిమ దేశాల డబ్బు ఆకర్షించడంతో చాలా మంది అటు వెళ్లిపోయారు. అయినా నాడు వేసిన పునాదులు నేటికీ సోవియట్‌లో కళాకుసుమాల వికాసానికి దోహదపడుతున్నాయి.

సాహిత్యం పెద్ద ఎత్తున వెలువడింది. సోవియట్ బాల సాహిత్యం విశ్వవ్యాపితమైంది. ఆ కాలంలో సోవియట్ బాల సాహిత్యం, నవలలు, సైన్సు, ఇతర రచనలు తెలుగులోకీ, ఇతర భారతీయ భాషల్లోకీ కూడా విరివిగా అనువదించబడ్డాయి.

రష్యన్ సర్కస్

అక్టోబర్ విప్లవం ముందు నుండీ రష్యాలో సర్కస్ ప్రదర్శనలు జరుగుతున్నప్పటికీ విప్లవ ప్రభుత్వం వచ్చాక రష్యన్ సర్కస్ (మాస్కో సర్కస్ అంటారు) ప్రపంచ ప్రఖ్యాతి గాంచింది. అంతకు ముందు మాస్కోలో రెండు సర్కస్ కంపెనీలు నడుస్తుండేవి. ఒకటి సర్కస్ నికులిన్, రెండోది బోల్షోయ్ సర్కస్. 1919లో సోవియట్ ప్రభుత్వం సర్కస్‌ను జాతీయం చేసింది. కేంద్ర సర్కస్ సంస్థను ఏర్పాటు చేసి దేశవ్యాపితంగా శాశ్వత సర్కస్ ప్రదర్శనశాలలు నిర్మించింది.



సెర్గీ ఐసెన్‌స్టీన్

1929లో మాస్కో సర్కస్ స్కూల్ నెలకొల్పింది. ఆ విధంగా ప్రపంచంలోనే మొదటిసారి సోవియట్ యూనియన్‌లో ప్రభుత్వ రంగ సర్కస్ కంపెనీలు, శిక్షణా కేంద్రాలు నెలకొల్పబడ్డాయి. పశ్చిమ దేశాల సర్కస్‌ల మాదిరిగా కాకుండా శరీర సౌష్ఠవానికి రష్యన్ సర్కస్ అధిక ప్రాధాన్యతనిస్తుంది. సర్కస్ కంపెనీల్లో కళాకారులకు దేశంలోని పెద్ద అధికారులతో సమానంగా వేతనాలుండేవి. వారికి రిటైర్‌మెంట్ తరువాత పెన్షన్ ఇతర సదుపాయాలు కూడా ఉండేవి. చంటిపిల్లల తల్లులకు ఏడాది వరకు మెటర్నిటీ లీవు ఉండేది. ఒక్కో బృందం వారానికి తొమ్మిది ప్రదర్శనలిచ్చేది. ఏటా 7 కోట్ల మంది రష్యన్లు సర్కస్ చూసేవారు. సర్కస్ కళాకారులను ప్రభుత్వమూ, ప్రజలూ పెద్ద ఎత్తున గౌరవించేవారు. సర్కస్‌లో బఫూన్ వేషం వేసే ప్రముఖ కళాకారుడు ఒలెగ్ పాపోవ్‌కు ప్రభుత్వం 'యుఎస్ఎస్ఆర్ ప్రజా కళాకారుడు' బిరుదునిచ్చి గౌరవించింది.

సోవియట్ స్పోర్ట్స్, ఫిజికల్ ఎడ్యుకేషన్

కార్మికవర్గ రాజ్యం శ్రామికులు, వారి పిల్లల శరీర దారుఢ్యాన్ని, ఆరోగ్యాన్ని పెంచేందుకు ఫిజికల్ ఎడ్యుకేషన్, క్రీడలు, జిమ్నాస్టిక్స్, అథ్లెటిక్స్‌కు అధిక ప్రాధాన్యమిచ్చింది. బోల్షివిక్ విప్లవానంతరం కార్మిక వర్గ ప్రభుత్వం దేశవ్యాపితంగా స్వచ్ఛంద క్రీడా సంఘాలను (విఎస్ఎస్) నెలకొల్పింది. 1991లో సోవియట్ విచ్ఛిన్నమైనంత వరకు ఈ సంస్థలు పనిచేశాయి. ఈ క్రీడా సంఘాలు క్రీడలు, శరీర దారుఢ్యం, పర్వతారోహణం, బోటింగు, జిమ్నాస్టిక్స్ ఇతర అనేక అంశాల్లో కార్మికులు, విద్యార్థులు పాల్గొనేట్లు చూసేవి. క్రీడా పోటీలు నిర్వహించేవి. ప్రభుత్వ సహకారంతోబాటు ప్రజల నుండి నిధులు వసూలు చేసేవి. ప్రజాబాహుళ్య శారీరిక దారుఢ్య సంస్కృతిని పెంపొందించే లక్ష్యంతో ఇవి పనిచేసేవి. 1970 నాటికి ఈ సంస్థల్లో 2.5 కోట్ల మంది సభ్యులుండేవారు. ఈ స్వచ్ఛంద సంస్థలు క్రీడా మంత్రిత్వ శాఖతోనూ, ఇతర శాఖలతోనూ అనుసంధానంగా పనిచేసేవి. వీటి ఆధ్వర్యంలో దేశవ్యాపితంగా 7,500 వరకు క్రీడా, దేహ దారుఢ్య పాఠశాలలు నెలకొల్పబడ్డాయి. ఈ పాఠశాలల్లో మంచి ప్రతిభ కనబరిచే వారిని వాటికన్నా ఉన్నతమైన ఒలింపిక్ రిజర్వ్ పాఠశాలల్లో చేర్చేవారు. ఈ మొత్తం సంస్థల్లో 50,000 మందికి పైగా శిక్షకులు పని చేసేవారు.

ఇటువంటి ప్రజా బాహుళ్య దేహదారుఢ్య సంస్కృతి (ఫిజికల్ కల్చర్)ని సోషలిస్టు రాజ్యం పెంపొందించడం వల్లనే సోవియట్ యూనియన్ ఒలింపిక్స్ వంటి అంతర్జాతీయ క్రీడా పోటీల్లో అగ్రస్థానంలో నిలిచింది. సోవియట్ యూనియన్ 1952 హెల్సింకీ ఒలింపిక్స్‌లో తొలిసారిగా పాల్గొని అమెరికా తరువాత రెండో స్థానంలో నిలిచింది. అప్పటి నుండి 1988లో సియోల్ ఒలింపిక్స్ వరకు జరిగిన 8 ఒలింపిక్ పోటీల్లో సోవియట్ యూనియన్ 6 సార్లు ప్రథమ స్థానంలో నిలిచింది. 1992 నుండి రష్యా, దాని మాజీ రిపబ్లిక్ దేశాలు విడివిడిగా విశ్వ క్రీడా పోటీల్లో పాల్గొంటున్నాయి. అయినప్పటికీ ఈ దేశాలన్నిటి పతకాలు కలిపితే ఇప్పటికీ అవి ప్రథమ స్థానంలోనే నిలుస్తాయి. క్రీడా



మ్యాగ్జిం గోర్కీ

వ్లాదిమిర్ మయాకోవ్‌స్కీ

రంగంలో రష్యాలోనే కాకుండా మొత్తం సోవియట్ రిపబ్లిక్కుల్లో సోవియట్ ప్రభుత్వం వేసిన పునాది అది.

సోవియట్ సంస్కృతిపై దుష్ప్రచారం

ప్రపంచ తొలి కార్మికవర్గ రాజ్యం ఆర్థిక, సైనిక, శాస్త్ర, సాంకేతిక రంగాల్లోనే కాకుండా కళా, సాంస్కృతిక రంగాల్లో అప్రతిహతంగా పురోగమించడం పెట్టుబడిదారీ పశ్చిమ దేశాలకు గిట్టని విషయంగా తయారైంది. శ్రామిక రాజ్యంలో సాంస్కృతిక వికాసం తమ దేశాల్లోని కార్మిక వర్గాన్ని కూడా ఆకర్షిస్తే పాలకుల కొంప మునుగుతుంది. అందువల్ల సోవియట్ సాహిత్యం, క్రీడలు, కళారూపాలను దెబ్బతీయడానికీ, అప్రతిష్టపాలు చేయడానికీ తీవ్రమైన ప్రయత్నాలు చేశారు. దీనిలో భాగంగానే సోవియట్ యూనియన్‌లో కళాకారులకు స్వేచ్ఛ లేదనే ప్రచారం. పెట్టుబడిదారీ కాసుల సంస్కృతికి భిన్నమైన శ్రామిక వర్గ సంస్కృతిని నిర్మించేందుకు కార్మిక రాజ్యం ప్రయత్నించే క్రమంలో పెట్టుబడిదారీ అరాచక పోకడలపై నియంత్రణలు విధించిన మాట వాస్తవమే. బోల్షివిక్ విప్లవం తరువాత రష్యాలో సాంస్కృతిక విప్లవం రావాలని లెనిన్ పిలుపునిచ్చారు. శ్రామిక వర్గ సంస్కృతిలో మొత్తం శ్రామికుల ప్రజాతంత్ర వ్యక్తీకరణకు చోటు ఉంటుంది. ఈ వ్యక్తీకరణలో భిన్న వాదనలు, చర్చలకు అవకాశం ఉంటుంది. కాని విప్లవానంతరం సోవియట్ యూనియన్‌లో జరిగిన అంతర్యుద్ధాలు, రెండవ ప్రపంచ యుద్ధం, తదనంతర ప్రచ్ఛన్న యుద్ధం... వీటివల్ల శ్రామిక వర్గ సంస్కృతీ నిర్మాణంలో కొన్ని పొరపాట్లు జరిగాయి. ఈ పొరపాట్లను ఉపయోగించుకుని పశ్చిమ దేశాలు సోవియట్‌పై విపరీతమైన దుష్ప్రచారం గావించాయి. అక్కడ కళా, సాంస్కృతిక, క్రీడా రంగాల్లో అసంతృప్తులైన వారినీ, డబ్బుకు ఆశపడేవారినీ ఆకర్షించి దేశం విడిచి పారిపోవడానికి ఏర్పాట్లు చేసేవారు. వారిని అడ్డం పెట్టుకుని సోవియట్‌లో ప్రజలకు స్వేచ్ఛలేదు కాబట్టే పశ్చిమ దేశాలకు వలసలు వస్తున్నారని ప్రచారం గావించేవారు.

సెవోలోద్ పుదోవ్కిన్

ఒలింపిక్స్ లాంటి పోటీలు జరిగినప్పుడు క్రీడాకారులను ఆకర్షించి తమ దేశానికి తీసుకుపోయేవారు. సోవియట్ వ్యవస్థకు వ్యతిరేకంగా రాసే రచయితలకు నోబుల్, ఇతర బహుమతులిచ్చి కార్మిక వర్గ రాజ్యానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ప్రపంచ వ్యాపిత ప్రచారం గావించేవారు.

రైల్ స్టేషన్ టన్నెల్లలోను కళా వైభవం

సోషలిజం నిర్మాణంలో జరిగిన కొన్ని తప్పిదాల వల్ల, శ్రామిక వర్గ కళావికాసానికి గొప్పగా దోహదం చేసిన సోవియట్ యూనియన్ కూలిపోయింది. దాంతో పాటే అది నిర్మించిన కళా, సాహిత్య, సాంస్కృతిక సౌధమూ కూలిపోయింది. కానీ తొలి శ్రామిక రాజ్యం మిగిల్చిన అనుభవాలు కూలిపోలేదు. అవి ఇప్పటికీ ప్రపంచ శ్రామిక వర్గ మనోఫలకాలపై చెరిగిపోని గుర్తులవలె ఉన్నాయి. కార్పొరేట్ గబ్బు సంస్కృతిలో కొట్టుమిట్టాడుతున్న ప్రజానీకానికి ప్రత్యామ్నాయ సంస్కృతీ నిర్మాణ పోరాటంలో అవి నిత్యం స్ఫూర్తినిస్తూనే ఉంటాయి.

✦

గూగులమ్మయ్యలు

చంటోడికి పళ్లు ఎప్పుడొస్తాయనే ప్రశ్న నుంచి బిగ్ బ్యాంగ్ ముందు విశ్వం ఉందా అన్న ప్రశ్న వరకు ఏది తలెత్తినా, తలను తిప్పేసినా టకీమ్మని గూగులమ్మ సెర్చింజన్ కీలను తట్టేయడం యమ అలవాటు అయిపోయింది. మరి అంతకు ముందు ఇలాంటి సందేహాలను తీర్చే దారేదనే మీ ప్రశ్నకూ గూగుల్‌ను తోడెయ్యకండి. అదే ఇప్పుడు చెప్పబోయేది. అమెరికాలోని న్యూయార్క్ పబ్లిక్ లైబ్రరీ 1940ల్లోనే కొందరికి ఈ బాధ్యతలు అప్పగించింది. ఫోన్ కాల్ ద్వారా విషయాల్ని నివృత్తి చేస్తుండే వారు. అది ఇప్పటికీ కొనసాగుతోంది. 120 ఏళ్ల సంగ్రహణాల్ని బూజులు దులిపి మరీ వీళ్లు సరైన సమాధానాల్ని ఇస్తారు. చాలావరకు తొలి ఫోన్ కాల్‌తోనే సందేహాలు తీర్చేస్తారు. అందుకే వీళ్లను ఇప్పుడు 'గూగుల్ హ్యూమన్స్'గా పిలుస్తున్నారు. కానీ, గూగుల్‌కే వీళ్లదెవరిదైనా పేరు ట్యాగ్ చేస్తే సరిపోయేది. ఇప్పుడూ రోజుకు 300 వరకు ఫోన్‌కాల్స్ వస్తుంటాయట. ఫోన్ కాల్‌కు అదనంగా, ఈమెయిల్, చాటింగ్, టెక్స్ట్ మెసేజ్‌ల రూపంలో సమాధానాలిస్తున్నారు. అయితే కంప్యూటర్ల కాలంలో అవతల మాట్లాడే వ్యక్తి ఏ చాట్‌బాటో, డిజిటల్ స్వరమో అనుకుని 'ఇంతకీ నేను మాట్లాడేది మనిషితోనేనా?' అని అనుమానపడుతుంటారట. దానికి కిసుక్కున నవ్వేసే ఈ హ్యూమన్ సెర్చ్ ఇంజిన్లు వినియోగదారుల ప్రశ్నలు ఇంకా నవ్వు తెప్పించేవిగా ఉంటాయని అంటారు. వీళ్ల వేగంగా సమాధానాలు నివృత్తి చేయడానికి గూగులమ్మ వాకిట్లో వేళ్ళూ ఆడిస్తుంటారట. గూగుల్, ఇంటర్నెట్ వంటి సేవలు అందుబాటులో లేనపుడు వీరి సేవలు అత్యవసరం అవుతున్నాయి. ఎంతైనా మనిషి కావాల్సిందే.

వింతలోకం

పెన్ పైనాపిల్ యాపిల్ పెన్



ఇదేంటండి అర్థం పర్థం లేకుండా ఏంటిది అనుకుంటున్నారా? ఇదో సూపర్ హిట్ పాట. యూట్యూబ్‌లో రికార్డులు బద్దలు కొట్టేస్తున్న అతి పొట్టి పాట పీపీఏపీ. కేవలం 45 సెకన్ల పాటు ఉండే ఈ మ్యూజిక్ వీడియో 'పెన్ పైనాపిల్ యాపిల్ పెన్'ను తయారుచేయడం గురించి. దీనిలో పదాలు కూడా తక్కువే. నా దగ్గరో పెన్నుంది, యాపిల్ ఉంది, పైనాపిల్ ఉంది అంటూ సైగలతో చూపించి చివరకు వాటిని గుచ్చినట్టు చేసి చెప్పిందయిపోయిందంటాడు జపాన్‌కు చెందిన కమెడియన్ డైమావో కొసాక. విచిత్రమైన వేషధారణ నవ్వు తెప్పించే హావభావాలతో వెరైటీ మ్యూజిక్‌తో పికొటారో అనే పాత్రతో ఆకట్టుకునే ఈ వీడియోకి అనుకరణలు గంగ్నమ్‌ను మించిపోతున్నాయి. ముఖ్యంగా జపనీస్ టీనేజర్లు అచ్చు పికొటారోలా హావభావాలతో కరోకె వీడియోలతో కిరాక్ తెప్పిస్తున్నారు. ఈ ఏడాది ఆగస్ట్ 25న యూట్యూబ్‌లో విడుదలైన ఈ పాట బిల్‌బోర్డ్ జపాన్ హాట్ 100లో రెండో స్థానాన్ని దక్కించుకుని అందరి మతులు పోగొడుతోంది. అతి చిన్న పాట ఇలా బిల్‌బోర్డ్‌కెక్కడం ఓ ఘనతంటూ దీనికి గిన్నిస్ రికార్డు కూడా వచ్చేసింది. అస్సలీ పాటలో ఏముందో అది ఎందుకు 14 కోట్ల 20 లక్షలకు పైగా వీక్షణలు అందుకుందో ఎవరికీ అర్థం కాదు. ఒక్క నెలలో ఇంత రెస్పాన్స్ అంటే మాటలు కాదు. అదీ అది ఇప్పుడిప్పుడే మిగతా దేశాల్లోను వైరల్ అవుతున్నప్పుడే అంటే ఇంకెన్ని కోట్ల మంది చూస్తారో. ఈ పాటను మరింత పొడిగించి పెద్ద పెన్ను పాట పాడేసి యూట్యూబ్‌లో పెట్టేశాడు పికొటారో. అందుకే యూట్యూబ్‌ను ప్రపంచంలోనే అతి చిత్ర విచిత్రమైన చోటంటారు. దీనికీ అర్థం పర్థం లేదు.



స్టీల్ బ్లేడ్స్

ఓ బక్కపల్చటి కుర్రోడు రెండు చేతులతో ఓ కారును లాగితే..! ఓస్ మాకు బ్రూస్ లీ తెలుసులేవోయ్! అని మనోడి బలాన్ని తగ్గించేయొచ్చు. కానీ ఇతగాడు తన షోల్డర్ బ్లేడ్‌లపై అదేనండి వెన్ను దగ్గరుండే రెక్కల మధ్య కొక్కేన్ని నొక్కేసి కారును లాగేస్తున్నాడు. మధ్యప్రదేశ్‌కు చెందిన అభిషేక్ చౌబీకి ఇలా వస్తువుల్ని లాగడం 8 ఏళ్ల నుంచే అలవాటట. మార్కెట్లో దొరికే కొక్కేలు రెక్కల మధ్య సరిపోవని అతని తండ్రి అవ్‌దేశ్ సరిగ్గా అమరేలా ఓ చెక్క ముక్కను తయారుచేసి దానికి కొక్కేన్ని కొట్టాడు. దానికి తాడు కట్టి కారును ఈడ్చేస్తుంటాడు అభిషేక్. చిన్నప్పుడు పిల్లల్ని కుర్చీలో కూర్చోబెట్టి లాగుతూ ఇలా ఆడించిన అభిషేక్ ఇప్పుడు కార్లతో ఆడేసుకుంటున్నాడు. ఆ మధ్య 1050 కేజీల బరువున్న కారును 27.5 మీటర్లు లాక్కెళ్లడంతో అందరూ అవాక్కయ్యారు. ఆ తర్వాత ఏకంగా రెండు కార్లను ఈడ్చేయగలిగాడీ రెక్కబలి. బాహుబలులు మనోడ్ని చూసి నోరెళ్లబెడతారేమో. పిలవడానికి బాగుండదనేమో రెక్కబలి బదులు 'స్టీల్ బ్లేడ్స్' అని పిలుస్తున్నారు. విమానాన్ని లాగుదామనుంటే చెప్పు నాన్నా! మంచి కొక్కెం చేసి పెడతానంటున్నాడు తండ్రి. ఎలాగైనా గిన్నిస్ రికార్డు కొట్టాలని అభిషేక్.. ఆ మెడల్ కొడుకు మెళ్లో చూడాలని అవ్‌దేశ్ పట్టుదలతో ఉన్నారు.



కథ చెబుతా వినండి...!



మీకు కథ చెప్పడం వచ్చా? అవును ఇది గొప్ప కళే. అందుకే అంత గొప్పగా కథ చెప్పడం వచ్చా అని అడుగుతున్నాం. పేదరాశి పెద్దమ్మలా చెప్పొచ్చు... మన బామ్మ తాతయ్యల్లా నటిస్తూ కళ్లక కట్టేయొచ్చు. లేదా నిద్ర మత్తులో అమ్మానాన్నలు మొక్కుబడిలాను పెదాలాడించొచ్చు. ఎన్ని చెప్పినా చివరకు తేలేదేంటి కథ చెప్పడమూ ఓ కళేనని. అందులో ఎన్నో శైలులున్నాయని. అలాంటి ప్రత్యేకమైన శైలుల్లో దస్తంగోయ్ ఒకటి. 16వ శతాబ్దపు ఈ ఉర్దూ మౌఖిక కళారూపం కొన్ని మార్పుచేర్పులతో 18వ శతాబ్దంలో భారత్‌లోకి ప్రవేశించి అత్యున్నత స్థానాన్ని దక్కించుకుంది. కాలానుగుణంగా వచ్చిన మార్పులతో కాలగర్భంలో కలిసిపోయింది. జనరంజకమైన ఒకప్పటి దస్తంగోయ్‌ని నేటి తరానికి పరిచయం చేయడానికి తన గొంతుతో ఊపిరి పోస్తున్నాడు అంకిత్ ఛద్దా.

ప్రస్తుతం ఎక్కడ చూసినా టివి, సెల్ ఫోన్, ఇంటర్నెట్ మాత్రమే వినోద మాధ్యమాలుగా రాజ్యమేలుతుండటంతో నేటితరం పిల్లలందరూ మౌఖిక కథా రూపాలకి దూరమవుతున్నారు. సమాజానికి ఉపయోగపడే విషయాలని కథల రూపంలో చెప్పడమే ఈ కళ ముఖ్య ఉద్దేశం. పెద్ద పెద్ద లైట్లు, భారీ సెట్టింగులు, అలంకరణలు, బృందం ఇలాంటి వాటితో పని లేకుండా ఒక చిన్న వేదికపై ఒక కుర్తా, టోపీ ధరించిన వ్యక్తి పర్షియన్- ఉర్దూ సాహిత్యంలో చెప్పే కథలతో సాదా సీదాగా సాగిపోతుంది దస్తంగోయ్. పర్షియన్ భాషలో దస్తన్ అంటే కథ. గోయ్ అంటే వ్యాఖ్యానం. అంటే వ్యాఖ్యాన రూపంలో కథలని చెప్పే విధానమే దస్తంగోయ్. ఇందులో కథ చెప్పే వ్యక్తిని దస్తంగొ అని పిలుస్తారు. శ్రోతలని ఆకట్టుకునేలా కథలని చెప్పడంతో పాటు అప్పటికప్పుడు ఊహాత్మక కథలని రచిస్తూ సందర్భానుసారంగా వాటిని చెప్పాల్సి ఉంటుంది. అరబ్బుల నుండి ఇస్లామ్‌లోకి అందిన దస్తంగోయ్ 18వ శతాబ్దంలో భారత్‌లోకి ప్రవేశించింది. అప్పటి సమకాలీన అంశాలని దస్తంగోయ్‌లో ప్రవేశపెట్టేవారు. వినోదంతో పాటు విజ్ఞానాన్ని పెంచే ఈ మౌఖిక కథా సంప్రదాయానికి బాకర్ అలీ భారత్‌లో విస్తృత ప్రచారాన్ని అందించారు. కొంతకాలానికి అతని మరణంతో 20వ శతాబ్దంలో మరుగున పడిందీ కళ. తిరిగి 2005లో ప్రఖ్యాత ఉర్దూ పండితులు ఎస్ ఆర్ ఫారూఖీ ద్వారా పునరుద్ధరింపబడినా ఉర్దూ భాషపై పూర్తి అవగాహనలేని నేటి తరానికి చేరువ కాలేకపోయింది. దాదాపు దశాబ్దం క్రితం అన్ని తరగతుల ప్రజలనీ అలరించిన ఈ కళని తిరిగి జనరంజకంగా మార్చేందుకు కృషిచేస్తున్నాడు అంకిత్. ఢిల్లీలోని హిందూ కాలేజ్‌లో చదువుతున్న రోజుల్లో సమాజాన్ని చైతన్య పరిచే కథలని రాసి హిందుస్తానీ వీధినాటకాలుగా ప్రదర్శించే వాడు అంకిత్. తన శోధనలో భాగంగా దస్తంగోయ్ గురించి తెలుసుకున్నాడు. ఇందులో ప్రదర్శనలివ్వాలంటే శ్రావ్యమైన గొంతుతో పాటు ఉర్దూ భాషపై పట్టుండాలి. ఉర్దూ తనకి పరిచయం లేని భాషే అయినా దస్తంగోయ్ మీద మక్కువతో సొంత సాధనతో ఆ భాషని నేర్చుకున్నాడు అంకిత్. మహమ్మద్ ఫారూఖీ ప్రదర్శనలు అతనికి ఎంతగానో ఉపయోగపడ్డాయి.

జనం మాటగా..

దేశంలో మొబైల్ పరిశ్రమ ప్రభావం కథాంశంగా 2010లో తన తొలి ప్రదర్శననిచ్చాడు. అంకిత్ ప్రయోగాత్మకంగా ఇచ్చిన ఈ ప్రదర్శనకి వందలాది ప్రేక్షకుల ఆదరణ లభించడంతో తన కార్పొరేట్



ఉద్యోగాన్ని వదిలి పూర్తి స్థాయిలో దస్తంగోయ్ ప్రదర్శనలివ్వడం ప్రారంభించాడు. చరిత్ర, సమకాలీన రాజకీయాంశాలతో పాటు 'ఏలిస్ ఇన్ వండర్‌ల్యాండ్', 'త్రీ హండ్రెడ్ రామాయణాస్' వంటి కథలతో సాగే తన ప్రదర్శనలు పిల్లలని కూడా ఎక్కువగా ఆకట్టుకునేవి. సాహిత్యానికి సంబంధించిన అనేక పుస్తకాల అధ్యయనంతో పాటు వివిధ గ్రామాలకి ప్రయాణిస్తూ వారి జీవన శైలిని ఎప్పటికప్పుడు తెలుసుకునేవాడు అంకిత్. నేటి సమాజానికి ఉపయోగపడేలా రూపాంతరం చేస్తూ స్క్రిప్టులని తయారు చేసుకోవడం, ప్రదర్శనివ్వడంలో ఆరితేరాడు అంకిత్. 'దాస్తాన్ ఏలిస్' పిల్లల కోసం తను చేసిన తొలి ఆధునిక రూపాంతర కథ. ఢిల్లీ జెఎన్‌యూలో 2016 ఫిబ్రవరిలో 'దాస్తాన్ ఎ సెడిషన్' పేరుతో ఒక ప్రదర్శనిచ్చాడు అంకిత్. ఒకప్పటి కథలు కళా రూపాలు నేరపూరితమైన మన చట్టాలని మార్చలేక పోతున్నాయి, పేద వారికి అవసరమైన ఆహారాన్ని అందించలేకపోతున్నాయి. అలాంటప్పుడు వీటిని ప్రదర్శించడమెందుకంటూ కొందరు విద్యార్థులు అంకిత్‌ని ప్రశ్నించారు. చట్టాలని మార్చలేక పోయినా సమాజంలో ప్రజలు ఏం కోరుకుంటున్నారో.. ఎలా జీవించాలనుకుంటున్నారో ముక్తకంఠంతో ప్రభుత్వాలకి తెలిసేలా చేసేందుకు ఇలాంటి కళారూపాలు ఎంతగానో దోహదపడతాయంటాడు అంకిత్. ప్రజల మనోభావాలని ప్రభుత్వానికి తెలిసేలా దస్తంగోయ్ ప్రదర్శనలివ్వడంతోపాటు వారిని చైతన్య పరిచేందుకు కృషి చేస్తున్నాడు.

– శర్వాణి

జనం పదం, పాదం కలిస్తే

జానపదం


భవాయ్

విభిన్న సంస్కృతులకు నిలయమైన మన దేశంలో వివిధ రకాల నాట్య సాంప్రదాయాలు ,
పామరుడి నుంచి దేశ ప్రథమ పౌరుడి వరకు అందరినీ ఇట్టే ఆకర్షించి చెప్పదలుచ
ఇవ్వదలుచుకున్న సందేశాన్ని... సూటిగా మనసుకు హత్తుకునేలా చెప్పే ప్రక్రియే జానపద
ఉపయోగించేది సామాన్య భాష. ఇందులోని అభినయం సగటు జీవికి తేలికగా అ

సంగీతం, నాట్యం, నటన, వాచకం, దృశ్యం - వీటన్నింటి కలయికను ఏకరూపంలోకి తీసుకురావడం జానపద నాట్యం. ఇది లేని పండుగలు, ప్రత్యేక వేడుకలు, ఉత్సవాలు ఉండేవి కావు. ఈ నాటకాలు విభిన్న ప్రాంతీయ రూపాలను సంతరించుకుని ఆ ప్రాంత జనపదాలుగా ప్రసిద్ధి చెందాయి. కొన్ని శతాబ్దాలపాటు గ్రామీణులను అలరించాయి. అనువైన రంగస్థలాలు లేని ప్రదేశాలలో కూడా తన కళారూపాన్ని ప్రదర్శించేందుకు ముందుకు వచ్చేవాడు జానపద కళాకారుడు. ఇవి కాలక్రమేణ వివిధ భాషలలో ఆధునిక ప్రదర్శనలు, కళా వేదికలు వృద్ధి చెందడంలో ప్రధాన పాత్రను పోషించాయి. ప్రస్తుత కాలంలో జానపద ప్రదర్శన... నాటకం యొక్క మూల సిద్ధాంతాలను తనలో ఇముడ్చుకుంది. దేశ వారసత్వ సంస్కృతిలో విడదీయరాని కళారూపాలుగా సమ్మేళితమయ్యాయి. ప్రధానంగా దేశంలోని మిగతా ప్రాంతాల్లో 12 రకాల జానపద నృత్య రీతులు కొనసాగుతున్నాయి.

కూడియాట్టమ్

అత్యంత ప్రాచీన సాంప్రదాయ నృత్య రూపం. ప్రాచీన కాలంలో ప్రదర్శించిన నాటక ప్రదర్శన సూత్రాలు ఇందులో ఇమిడి ఉన్నాయి. నృత్య రీతి కేరళ సంస్కృతిలో వేళ్ళూనుకుంది. దేవాలయాలకు సంబంధించిన ఆచార వ్యవహారాలు ఈ నృత్య రీతిలో దర్శనమిస్తాయి. కూడియట్టమ్ నృత్య రీతిని 2001లో యునెస్కో వారసత్వ సంపదగా గుర్తించింది.

స్వాంగ్

హర్యానా, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్‌లో బాగా ఆదరణ పొందిన నాట్యరీతి. ఇది సంగీత ప్రధానంగా ఉంటుంది. దాదాపు 12 మందికి పైగా కళాకారులు ఒక బృందంగా ఏర్పడి పాటలు పాడుతూ తదనుగుణంగా నాట్యం చేస్తారు. గతంలో ఆరుబయట ప్రదేశాలలో దీనిని ప్రదర్శించేవారు. సుదీర్ఘ సంభాషణలు, పాటలు ఇందులో చోటు చేసుకుంటాయి. ఇందులో రెండు పద్ధతులున్నాయి. ఒకటి భాంగ్రా భాషలోనూ, మరొకటి బ్రజ్ భాషలోనూ ఉంటుంది.


భండ్‌పతేర్

భండ్ పతేర్

శతాబ్దాల క్రితం నాటి నృత్య ప్రదర్శన ఇది. కాశ్మీర్ దీనికి పుట్టినిల్లు. నాట్యం, సంగీతం, నటన మూడూ ఇందులో మిళితమై ఉంటాయి. స్థానిక ఇతిహాసాలు, ప్రాచీన కథలను సమకాలీన సామాజిక పరిస్థితులకు అన్వయిస్తూ వ్యంగ్యోక్తులు, హాస్యంతో కూడిన సంభాషణలు ఇందులో కనిపిస్తాయి. కథ చెప్పే తీరు అందరినీ ఆకట్టుకుంటుంది. దీనిని సాయంత్ర సమయాలలో ప్రదర్శిస్తారు. తెల్లవారు ఝాము వరకు ఈ ప్రదర్శన కొనసాగుతూనే ఉంటుంది. డోలు, నగారా, సన్నాయి తదితర సంగీత పరికరాలు ప్రధానం.

అన్కియా నటభ్యాన్ (ఏకాంకి/ఏకపాత్ర)

ఇది అస్సాం గ్రామీణ ప్రాంతాలలో పురుడు పోసుకుంది. అస్సాంకు చెందిన శ్రీమంత్ శంకర్ దేవ్ దీని రూపకర్త. బ్రజవలి భాషలో దీనికి సంబంధించిన కథలను రచించారు. అస్సాం, మైథిలిల సమ్మేళిత భాషే బ్రజవలి. ఇందులోని కథలన్నీ హిందువులు వైనంగా పూజించే కృష్ణుడు ప్రధానాంశంగా సాగుతాయి. దీనిని ప్రదర్శించే కళాకారుడు ఉపయోగించే భాష, వేషధారణ, ధరించే ఆభరణాలు, రంగస్థలంపైకి ప్రవేశం, పాదాల కదలిక అన్నీ ప్రత్యేకంగా భిన్న రీతిలో ఉంటాయి.

తమాషా

మహారాష్ట్రకు చెందిన ఒక నృత్య రీతి. 18,19 శతాబ్దాల నాటి మహారాష్ట్ర పాలకులు దీనిని బాగా ఆదరించారు. బాజీరావు-2 హయాంలో ఇది బాగా ప్రాచుర్యం పొందింది. గోంధల్, జాగరణ, కీర్తనలనే జనపదాల రూపాలతో సమ్మిళితమై ప్రత్యేక జనపదంగా రూపు దాల్చింది. ఇందులో మహిళా పాత్రధారిణి ప్రముఖ పాత్ర పోషిస్తుంది. సాంప్రదాయ సంగీతం ఈ నృత్య రీతిలో ఇమిడి... వేస్తూ నాట్యం చేయడం, నటులు... భంగిమలలో నాట్యాన్ని ప్రదర్శిస్తా...

యక్షగానం

ఇది కర్ణాటకకు చెందిన ... దీనికి దాదాపు 400 ఏళ్ల చరి... కర్ణాటకలోని గ్రామీణ ప్రాం... ముఖ్యంగా తీర ప్రాంతాల్లో ... ఆదరణ పొందింది. పురా... ఇతిహాసాలలోని కథలను ఈ ... రూపంలో ప్రదర్శిస్తారు. ఈ నాట... శరీర భంగిమలు, హస్త... చలనాలు, నేత్ర చలనాలతో వివిధ వి న్యాసాలం...


తెరికూతు

ు..

వివరం

ప్రచారంలో ఉన్నాయి.
కున్న అంశాన్ని..
కళా రూపం. ఇందులో
ర్థమయ్యే భావం.

- కె.శ్రీనివాస మూర్తి

ఉంటుంది. వేగంగా అడుగులు
భిన్న రూపాలలో, వివిధ
ు.

ృత్య రూపం.
్ర ఉంది.
ంతాలలో
బాగా
ాలు,
నాట్య
్యంలో

తెరికూతు (వీధి నాటికలు)

తమిళ నాటికలోని గ్రామీణ ప్రాంత ప్రజలకు ఇది ఒక వినోద కార్యక్రమం. దీనిపై సాంప్రదాయ సంస్కృత నాటక ప్రభావం కొంత ఉంది. దీనిని ఆరు బయట ప్రదేశాలల ప్రదర్శిస్తారు. ప్రత్యేకించి గ్రామాలలో ఆలయాల వద్ద జరిగే ఉత్సవాల వద్ద ప్రదర్శిస్తారు. పౌరాణిక, ఇతిహాసాలు ఇందులో ప్రధాన కథలుగా ఉంటాయి. నటులు పెద్ద గొంతులో పాటలు పాడతారు. స్వర మాధుర్యం ఉంటుంది. అప్పుడప్పుడు స్త్రీ వేషాలు వేస్తారు. ప్రదర్శనలకనుగుణంగా అలంకారం చేసుకుని కళాకారులు నటిస్తారు.

ఆకట్టుకుంటాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఈ ప్రదర్శన కొనసాగుతూనే ఉంటుంది.

జత్రా

ఒడిశా, బీహార్‌లల్లో ప్రజాదరణ పొందిన కళారూపం. 15వ శతాబ్దంలో బెంగాల్‌లో రూపు దిద్దుకుంది. కృష్ణ భక్తుడు చైతన్య ప్రభు ప్రభావంతో తొలి నాళ్ళలో కృష్ణ జాతరగా పేరు పొందింది, కాలక్రమంలో ప్రేమ, రాజకీయ-సామాజిక కథాంశాలు ఇందులో చోటు చేసుకున్నాయి. తొలుత సంగీత ప్రధానంగా ఈ ప్రదర్శన సాగేది. ఇప్పుడిప్పుడు సంభాషణలతో కూడి నటన, కొన్ని పాటలు కూడా ప్రదర్శనలో చొరబడ్డాయి.

భవాయే

గుజరాత్‌లోని కచ, కటివార్ ప్రాంతాలు దీని జన్మ స్థలాలు. హాస్యంతో పెనవేసుకున్న సూక్ష్మమైన సామాజిక విమర్శ ఈ ప్రదర్శనలోని ప్రత్యేకత. భంగల్, పక్వాజ్, రబాబ, సారంగి, మంజీర అనే సంగీత పరికరాలను ఈ ప్రదర్శనలో ఉపయోగిస్తారు. ఇది వినోదాన్ని కలిగించే నాటక రూపం.

దశావతార్

కొంకణ తీర ప్రాంతంలోని రైతులు ఈ నృత్య ప్రదర్శనను అభ్యసించేవారు. ప్రత్యేకించి మహారాష్ట్ర, గోవాలలోని కొన్ని ప్రాంతాలలో ఈ నృత్యరీతి కొనసాగుతుంది. అవతారాలకు అనుగుణమైన అలంకరణను కళాకారులు చేసుకుంటారు. పేపరుతోనూ, చెక్కతోనూ చేసిన ముసుగులను ధరిస్తారు. ఈ ప్రదర్శనలో మూడు సంగీత పరికరాలు ప్రధాన పాత్రను పోషిస్తాయి. అవి ఫిడేల్ హార్మోని, తబలా, జన్జ.



వర్యాల

హిమాచల్ ప్రదేశ్‌కు చెందిన సాంప్రదాయ నృత్యరీతి, సాధారణంగా దీనిని దసరా ఉత్సవాలలో ప్రదర్శిస్తారు. హిమాచల్ ప్రదేశ్‌లోని విభిన్న ప్రాంతాలకు చెందిన స్థానికులు అందరూ కలిసి దీనిని ప్రదర్శిస్తారు. ఈ ప్రాంత గ్రామీణులు నిత్య జీవితంలో ఎదుర్కొంటున్న ఇబ్బందులు, జీవన విధానం నుంచి ఈ ప్రదర్శన పుట్టుకొచ్చింది. ఆరు బయట ప్రదేశాలలో దీనిని ప్రదర్శిస్తారు. మధ్య మధ్యలో నాట్యం, హాస్య పూరిత నటన ఇందులో మనకు కనిపిస్తోంది.

రమ్మాన్

ఉత్తరాఖండ్‌లోని గడ్వాల్ ప్రాంతంలో ఉత్సవాల సందర్భంగా దీనిని ప్రదర్శిస్తారు. తమ గ్రామ దేవతను గౌరవిస్తూ ఉత్తరాఖండ్‌లోని జంట గ్రామాలైన సలూర్- డంగ్రాలు ప్రతి ఏటా ఉత్సవాన్ని నిర్వహిస్తాయి. స్థానికంగా పాడుకునే పాటలతో పాటు, ముఖానికి వివిధ రూపాలలో ఉన్న ముసుగు ధరించే నాట్యాలు కూడా ఇందులో భాగంగా ఉంటాయి.

సాంప్రదాయ జానపద కళారూపాలు రానురాను చైతన్య వంతమైన ప్రజాకళారూపాలుగా రూపుదిద్దుకున్నాయి. ప్రజాస్వామిక, అభ్యుదయ వాదులు వీటికి సమకాలీన రాజకీయ, ఆర్థిక, సామాజిక అంశాలను చేర్చి శక్తివంతమైన కళారూపాలుగా తీర్చిదిద్దుతున్నారు. ప్రజల్ని ప్రభావితం చేసే దిశగా వీటిని ప్రదర్శిస్తున్నారు. ప్రస్తుతం ప్రదర్శితమవుతున్న వీధి నాటకాల్లో జానపద కళారీతుల్ని చొప్పించడం చూస్తూనే ఉన్నాం. ఇవే ప్రజలను తమ సమస్యల పరిష్కారానికై పోరాట దిశగా నడిపిస్తున్నాయి. జనం పదం, పాదం కలిస్తే... జానపదం. అభ్యుదయ పథంలో అవి సాగితే సమాజానికి చైతన్య రథం బయలుదేరినట్టే.



కవిత్వమ్

లోపలా-బయట

ఒక వైపు
నిర్బంధపు భావాల మధ్య
అడవి రెక్కల మధ్య
స్వేచ్ఛను లెక్కిస్తూ
సిద్ధాంతాల్ని ఎత్తుకుని
చూపులు తడబడినపుడు
దేహాలు
నెత్తురుని శ్వాసిస్తున్నాయి.
లాక్కోవడం మొదలయ్యాక
ఎరుపు జెండాలు
మొలుస్తూనే వున్నాయి.
బతుకు పుక్కిట్లో
వెన్నెల పొడుపు కోసం
పోరాటాలు
ఉబుకుతున్నాయి
చీకటిపై పోరాటాలు పోలేదు
అగ్గి రాజుకోవటం చెదిరిపోలేదు
కొన్ని శాసనాలు
తలరాతల్ని మార్చడం లేదు

• • •

మరో వైపు
పొంచివున్న శత్రుసైన్యం
తూటాలా ఊగిసలాటలో
సరిహద్దులు
ఊగిపోవడం ఉలిక్కిపడటం
కంటిముందే చెమ్మగిల్లే
దృశ్యమవుతోంది.
పటాలుగా వేలాడుతున్న
వీరజవాన్లు
గుండెల్ని తడుపుతున్నారు.
లోపల దాడికీ
బయట యుద్ధానికీ
వీడని ముడి
ఏదో గుండెను గుచ్చుతూనేవుంది.

-గవిడి శ్రీనివాస్
08722784768

పుట్టినూరినొదిలి



జన్మకారకులనొదిలి
నేలనొదిలి
పెళ్ళాం పిల్లలనొదిలి
పొరుగూరుకి
పయనం
కాలే కడుపు
చేతబట్టుకుని
ఒంటరిగా
ఒంటరై బతుకు
అరకొర పైకం
అరగదిలో ఉంటూ
ఆలోచనల పర్యంలో
ఏం సాధించామో
ఏం సాధించాలో
కొట్టుమిట్టాడుతూ
రేపటికై ఆశగా
దీనంగా పలవరిస్తూ
క్షణ క్షణం
మనసు గాయం
ఎన్నాళ్ళుంటామో
భూమిపై తెలీదు
అడుగడుగునా
ఆత్మీయత
జీవచ్ఛవం
స్పర్శలోని
ఆప్యాయత మరచి
దుఃఖంలో స్వ ఓదార్పు
జీవిత చివరి మజిలీ
మరణంలో
సైతం
పుట్టినూరు వెళ్తావో లేదో
నీకై
రాల్చే కన్నీటిచుక్క
కోల్పోయిన స్పర్శజ్ఞానాన్ని
పొందుతుందేమో
దేహం
అచేతనావస్థలో

-గిరిప్రసాద్ చెలమల్లు
gpchelamallu@gmail.com

ఒక్క విజయం కొండంత ఆత్మస్థైర్యాన్ని పెంపొందిస్తుంది. ఒక అంతర్జాతీయ టోర్నీ విజయంతో అండర్-18 ఫ్రెంచ్ ఓపెన్ టోర్నీలో అడుగు పెట్టింది 15 ఏళ్ల బెంగాలీ బాలిక. ఎటువంటి అంతర్జాతీయ వేదికపైన మెరవకపోయినా తన ప్రతిభతో వరల్డ్ నెంబర్ వన్ కలను సాకారం చేసుకోవడానికి కసరత్తును ప్రారంభించింది. క్రీడల్లో రాణించాలన్న పట్టుదల, అందుకు తగ్గ ప్రణాళిక, ఆత్మస్థైర్యం ఉంటే పతకాలు వాటంతటవే దరిచేరుతాయని నిరూపిస్తోంది యుబ్‌రానీ బెనర్జీ. దేశ టెన్నిస్ క్రీడలో యువరాణిగా రాణిస్తోంది. మరో టెన్నిస్ స్టార్‌గా వాలీల్ని స్మాష్ చేస్తోంది.

టెన్నిస్ యువరాణి

విజేత

కోల్‌కతా సమీపంలోని చందానగర్‌లోని ఓ కుగ్రామంలో సాధారణ కుటుంబంలో నవంబర్ 9, 2000లో పుట్టింది యుబ్‌రాణీ బెనర్జీ. ఇటీవల అండర్-16 జాతీయ చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్న బెనర్జీ వచ్చే ఏడాది జరిగే ఫ్రెంచ్ ఓపెన్ అండర్-18 కేటగిరి బరిలో ప్రత్యర్థులతో తలపడాలనే సంకల్పం కూడా మొదలైంది. నిరంతర కఠోర శిక్షణతో రాటుదేలుతూ అంతర్జాతీయ వేదికపై సత్తా చాటే ధైర్యాన్నీ పోగేసుకుంటోంది 15 ఏళ్ల బెనర్జీ. శిక్షణ విషయంలో నిర్లక్ష్యం బెనర్జీ దరిదాపుల్లో కనిపించదు. కొంత కాలం క్రితం బెంగాల్‌లో వరదలు సంభవించడంతో అన్ని క్రీడా ప్రాంగణాలూ వరద నీటితో నిండిపోయాయి. చందా నగర్‌లో శిక్షణకు ఏ మాత్రం అవకాశం లేకపోవడంతో తన రాకెట్‌తో రోజూ సమీప పట్టణానికి నడుచుకుంటూ వెళ్లి సాధన చేసేది బెనర్జీ. మూడు కిలోమీటర్లు నడిచి వెళ్లి రబీంద్ర సదన్ ప్రాంతంలో జిమ్‌లో వ్యాయామంతో పాటు అక్కడ రోజువారీ శిక్షణను కొనసాగించేది. వరదల కారణంగా ఇతర క్రీడాకారులు ప్రాక్టీస్‌ని మానుకున్నా ఒంటరిగానే బెనర్జీ సాధన కొనసాగింది. ప్రకృతి వైపరీత్యాలకు సైతం తలవంచకుండా లక్ష్యానికి కట్టుబడి శిక్షణ కొనసాగించిందనడానికి ఇదే నిదర్శనం. ఆమె కుటుంబంతో పాటు టెన్నిస్ అకాడమీ బెనర్జీకి ప్రోత్సాహాన్ని అందించింది. మెరుగైన ఆటతీరుతో బెనర్జీ క్రీడలో ముందడుగేస్తున్నా కొన్నిసార్లు ఆర్థిక ఇబ్బందులు ఆమెని వెన్నంటేవి. తమ కుటుంబం ఆర్థికంగా వెనుకబడడంతో ఫండింగ్ విషయంలో పూర్తి సహకారం అందించలేకపోయినా స్వయం శక్తితో అండర్-16 చాంపియన్ షిప్‌ను సాధించడం తనకెంతో ఆనందాన్నిచ్చిందంటారు తండ్రి అరవింద్.

సానియాలానే....

కోల్‌కతాలోని ఆర్డినెన్స్ టెన్నిస్ క్లబ్ కోచ్ ఇనిరికో పిపెర్నో తొలిసారి బెనర్జీ ఆట తీరుని చూసి ఆశ్చర్యపోయారు. భారత్ టెన్నిస్ స్టార్ సానియా మీర్జాలాగానే బెనర్జీ కూడా బాల్‌ను హిట్ చేస్తుందట. శిక్షణ మొదలు పెట్టినప్పటి నుంచి ఆటలో నిమగ్నమయ్యే తీరును చూసి ఆశ్చర్యపోయానంటారు పిపెర్నో. తనపై కలిగి నమ్మకంతో ఫీజు తీసుకుండానే శిక్షణ ఇచ్చేందుకు ఒప్పుకున్నారు. 12, 13 ఏళ్ల వయస్సులో సానియా గెలుపు కోసం ఏ విధంగా కష్టపడిందో అదే రీతిలో బెనర్జీ కూడా సాధన చేస్తోంది. కృషి, పట్టుదలతో జాతీయ స్థాయిలో వ్యక్తిగత కృషితో అద్భుతంగా రాణిస్తున్నారు బెనర్జీ. ఇటువంటి క్రీడాకారిణులకు అంతర్జాతీయ స్థాయిలో ఆడేందుకు అవసరమైన ఆర్థిక సహకారం, ఇతర సౌకర్యాలను ప్రభుత్వ పరంగా అందిస్తే మరిన్ని పతకాలు సాధించగలుగుతారు. భారత్ తరపున వింబుల్డన్ బరిలో టైటిల్ సాధించాలనేది బెనర్జీ ఆశయం. భవిష్యత్తులో భారత్‌కు మరిన్ని పతకాలు సాధించగలననే ఆత్మస్థైర్యంతో పాటు వరల్డ్ నెంబర్ వన్ ర్యాంకు సాధించి తీరతాననే విశ్వాసం వ్యక్తం చేస్తోంది బెనర్జీ.

- ఈశ్వర్ నెట్టెం

బెనర్జీ సాధించిన టైటిళ్లు....

- ఈ ఏడాది రెండు సింగిల్స్ టైటిళ్లను సాధించింది. డబుల్స్‌లో ఓ టోర్నీలో విజేతగా నిలిచింది. కెరీర్‌లో 5 డబుల్స్ టైటిళ్లను సాధించగా, ఏడింటిల్లో పరాజయం పాలైంది. మొత్తం 8 సింగిల్స్ టైటిళ్లను సొంతంచేసుకోవడం మరో విశేషం.
- 2015లో మహిళల ఓపెన్ సింగిల్స్ మెయిన్ డ్రాకు అర్హత సాధించిన బెనర్జీ 51వ ఫ్లులిడ్ టెన్నిస్ టోర్నీ ఫైనల్లో క్లే కోర్టులో రెండో సీడ్‌ను మట్టి కరిపించింది. గంటా 50 నిమిషాల పాటు హోరాహోరీగా సాగిన ఈ పోరులో శ్రుతి గుప్తాను 6-0, 6-3తో ఓడించి టైటిల్‌ను కైవసం చేసుకుంది బెనర్జీ.
- 2016లో భువనేశ్వర్‌లో జరిగిన ఎఐటిఎ-ఓటిఎ ఛాంపియన్ సిరీస్ టైటిల్‌ను సాధించింది.
- రితుపర్ణ చౌదరీను 6-4, 6-2తో ఓడించి విజేతగా అవతరించింది బెనర్జీ.

ఒసే తువ్వాలు అందుకో

- శ్రీశ్రీ

'ఆ హా....ఏమి...నా...ఆ..ఆ భాగ్యము... పాడుతూ స్నానాలగదిలో ప్రవేశించాడు. సంగీతం ప్రపంచ భాష అయితే స్నానాలగది గానమందిరం. ప్రాక్పశ్చిమాల భేదంలేని ఆచారం స్నానాలగదిలో సంగీతం పాడడం! ఒంటిమీద నీళ్లు పడతాయంటే గొంతుక తంత్రులు సవరిస్తుంది.

తలుపు వేసుకున్నాడు.

'ఆహా..ఏమీ...నా..ఆ.

సరిగ్గా సక్కుభాయిలాగే విరుపులు విసిరాడు. అంటే తుంగల చలపతిరావులాగ, దాసరి కోటిరత్నం ఎలా పాడుతుందో వినలేదు. చచ్చి ఏ స్వర్గాన వున్నాడో చలపతిరావు అసలు చచ్చిపోయాడో లేదో రామనాథశాస్త్రి అనుకుంటాను లేదు. ఇద్దరూ. "ఆ ...భాగ్యముస్వామి కనిపించెను.

గావంచా విప్పేశాడు.

"పండరినాథుని పాదమె దొరికెన్.. పాపము లన్నియి నేడే తొలగెన్.." చలివేస్తుంది. నీళ్ల ఒంటిమీద పడనంతసేపే. ధైర్యం చేసి చెంబెడు నీళు పోసుకున్నాడు. ఆ వరసని నాలుగైదు చెంబులు గబగబా దిమ్మరించుకున్నాడు. బిందెడు వేణ్నీళ్లు తగలెయ్యకూడదూ పెళ్లాం ! కర్రలయి పోతాయట. ఏం చేస్తుందో వంటింట్లోంచి ఊడిపడదు.

వంటింట్లో సన్నగా ఆడగా, వంటపొగలలో కలిసి మెలిసి కంఠం.

"తొలి నే జేసిన పూజాఫలము" చదువుకుంటానంటే, సంగీతం నేర్చుకుంటానంటే, బలవంతం మీద ముడి వేయించారు. వద్దంటే వినక నన్ను నరకంలో తోసేరు. ఎన్నాళ్లయినా ఇంతే. నాకిది జన్మశిక్ష. వీణ మరిచిపోతున్నాను. నేర్చుకోని వంట నా నెత్తిమీద పడింది.

ఏమేవ్. సబ్బు కనబడదేం?

పడమటి గూట్లో ఉంటుంది.

తలుపు తీశాడు తోశాడు. తడుసుకుంటూ వెళ్లాడు అలాగే. సబ్బు తెచ్చుకున్నాడు గదిలోకి వెళ్లాడు. మళ్లీ తలుపు తీశాడు. మరో నాలుగు చెంబులు నీళ్లు పోసుకున్నాడు. ఈలతో పాడుతున్నాడు భాగ్యం పాట.

"షాషా...షీషీ...షా..షాషష..

ఏమిటో వెదవబతుకు స్నానం , భోజనం చెయ్యాలి. తాంబూలం, బట్టలూ, జోళ్లా వెయ్యాలి. వెళ్లాలి ఆఫీసుకి. టైమయిపోతుంది. వంటయిందో లేదో,రోజూ ఇదే ఏడుపు వారానికి రెండు ఆదివారాలు నెలకి డజను ఫస్టు తారిఖులూ ఉండకూడదూ? దొరల దేశాల్లో ప్రతివారం జీతాలిస్తారు. కానీ ఏం లాభం? తాగేస్తారు. దొరలకి చలి వెయ్యదూ? స్నానం చెయ్యరు ఉన్నిదుస్తులు వేసుకుంటారు. మాసిపోయిన గడ్డం చేసుకుంటే వూలుకోటు విప్పినట్టుంటుంది.

నోట్లో నీళ్లుపోసుకుని పుక్కిలించాడు ముక్కులోని కెళ్లాయి. ఉక్కిరి బిక్కిరైపోయాడు. సుజలాం, సుఫలాం, మలయజ శీతలంగానే వున్నాయి.

● ● ●

వంటింట్లో 'వందేమాతరం' పాట.

ఎందుకో ఈ జైళ్లకి వెళ్లడం? ఎవరి స్వాతంత్ర్యం కోసం? ఆడదానికి అడుగుతీసి అడుగువేసే అధికారం లేదు కదా నేనసలు పెళ్లి చేసుకోననే అన్నాను. స్వతంత్రంగా బదుకుదామనుకున్నాను. నాలుగేళ్లలోనే నా బదుకెంత నాశనమయిపోయిందో, రెండుమార్లు ఆసుపత్రిలో పడ్డాను. ఈ మాటయినా నిలుస్తుందో నిలవదో, వీడికేవో జబ్బులున్నాయి. ఏవో దురలవాట్లున్నాయి. ప్రతిరాత్రీ ఆలస్యంగా ఇంటికి రావడమే ఎలా తప్పుతుంది నాకీ ఖైదు?

.....సస్యశ్యామలాం, మాతరం..... వందేమాతరం.

● ● ●

వందేమాతరం పాటని ఫిలింలలో పాడనివ్వరట. స్నానాలగదుల్లో పాడుకోనిస్తారనుకుంటాను. ఇరవై ఏళ్లకిందటి నాన్‌కో ఆపరేషన్ పాటలు జ్ఞాపకం తెచ్చుకుంటున్నాడు.

నిరాకరణమను మిఠాయి ఇదిగో....

కన్వర్ట్ కన్వర్ట్ హాల్లో కల్లు కస్టమర్సు ఇంటూ నాన్కపారేష నను నవీన మతమునా... ఆరోజుల్లో అవే

బాగున్నాయి. అప్పుడు వాటి అర్థం తెలిసేది కాదు. స్కూళ్లు ఎగ్గొడితే హెడ్మాస్టరు బెత్తం దెబ్బలు వడ్డించాడు.

మరో ప్రపంచం మరో ప్రపంచం

మరో ప్రపంచం పిలిచింది...

ఈ పాటమీద నిషేధం ఉందా? ఎవరు చెప్మా దీన్ని రాశారు. ఎవడో కమ్యూనిస్టు కాబోలు. ఇదో వెర్రిపట్టు కుంది వీళ్లకి. సమానత్వంట! ఎలా వస్తుంది సమానత్వం? ప్రకృతిలోనే లేదు సమానత్వం కాబట్టి కమ్యూనిజం తప్పు – మరో ప్రపంచంమట? ఏమిటో అది?

వీపుకి సబ్బుపట్టించి తోముతున్నాడు. కపిలాయి గాత్రం రంగూన్‌లో పాడితే సిలోన్‌లో వినిపించేది. రేడియో లేని రోజుల్లో వీపు అందకురాకుండా ఉంది. రెండో చేతితో రాశాడు.

'మీరజాలగలడా సత్యావతి

వీపు గోకగలడా..

paraodyకి నవ్వొచ్చింది. అన్నీ ఇదివరకటివే. కొత్త కవిత్వం కొత్త ప్రపంచం కొత్త సంవత్సరం అంటారు. అంతా భ్రమ ఇదివరకు లేని విప్పుడేము న్నాయి? ఆ సూర్యుడే. ఆ చంద్రుడే. ఇదివరకు లాగే పెళ్లాడుతున్నాం. పిల్లల్ని కంటున్నాం. పెంచుతు న్నాం...చస్తున్నాం. పుడుతున్నాం.. మళ్లీ చస్తున్నాం..

చస్తున్నాను ఈ చలితో

ఒసే వంటయిందా?

● ● ●

శివ దీ.....క్షా పరురాలనురా...

ఎక్కడెక్కడకో పోతాడు. ఏవేవో ఖర్చులు నేను మాత్రం దమ్మిడీలతో సహా పద్దులు రాయాలి. నేనీ సంసారం చెయ్యలేను.నాకు స్వాతంత్ర్యం కావాలి. సమానత్వం కావాలి. వీణ్ని నేను ప్రేమించలేదు. ఎవన్నీ లేదా? ఏమో, ఏమో శర్మని? ఏమో మీరు నీళ్లు పోసుకునేసరికి నా వంట ఐపోతుంది.

● ● ●

అయినా పాపం ఒక్కతై. ఇంటి చాకిరీ అంతా చేసుకోవాలి. ఒక్కొక్క మారు చూస్తే జాలివేస్తుంది. కడుపుతో వుంది కూడాను.

కడుపు తోముకుంటున్నాడు. చిన్నప్పుడు మా అమ్మ ఒళ్లంతా తోమి కడుపు మాత్రం తోమేది కాదు. ప్రేమ ఉండదట. కడుపు ప్రేమ. కడుపు వల్ల ప్రేమ. ప్రేమవల్ల కడుపు. To make love అంటాం. కడుపు చెయ్యడం అంటాం. ప్రేమ చెయ్యడం అనం. To make belly అనం. ఒక్కొక్క భాష ఒక్కొక్క తీరు. ఇంగ్లీషు వాడు ఎంత కొట్టుకున్నా తెలుగుని క్షుణ్ణంగా అర్థం చేసుకోగలడూ? గెలట్టీ డిక్షనరీలో తప్పులు చూపిస్తూ భారతికొక వ్యాసం రాస్తాను. అలాంటివి వేస్తారో, వెయ్యరో? అసలు నా మొగం నేను రాసేదేమిటి. ఆఫీసు నుండి వచ్చేసరికి నవనాళ్లు తోడుకుపోతాయి. వెదవ ఉద్యోగం మానేస్తే! బతకలేకపోతాను? సంసారం ఒకటి కదా! రెండు ఎందుకు కూడదూ? నేను మళ్లీ పెళ్లిచేసుకుంటాను. మరి ఇదో? చీరకి నిప్పంటుకుని ఇది చావకూడదూ?

విషాదవార్త: నేటి ఉదయం... పేటలో శ్రీమతి (20 ఏళ్లు) వంట చేయుచుండగా చీరకు నిప్పంటుకొనబడెను. ఆసుపత్రిలో చేర్చబడెను. అచ్చటనే ఆమె మరణించబడెను.

వెధవ ఊహలు..పాపిష్టి మనస్సు. మనలో ఇంత కుళ్లు పెట్టుకుని లోకాన్ని తిడతాము.

కుళ్లు వదలినట్టేనా? కడుపు తోముకోవడం అయింది. దిగేడు నురగ: పీచు పరుపులో బూరుగు దూది దిగేడు. Attain-shun లకిడీకే మాఫిక్. తోముకుంటున్నాడు. Glass with care.

ఏమిటో నానా చెత్త రాసేస్తున్నారు. ఇది రాయొచ్చు ఇది రాయకూడదు అనే వివక్షత పోయింది. ఏమైనా అంటే ఫ్రాయిడ్ అంటారు. టైఫాయిడ్ అంటాను నేను. ఇమాజినేషన్‌కు జబ్బు చేస్తేనే ఇలాంటి పేలాపనలు. నేను కన్సర్వేటివ్‌ని ఉన్నదాన్ని నిలబెట్టుకోవాలంటాను. మార్పు నాకిష్టం లేదు. మర్యాదగా బతకాలంటాను. తప్పుపనులు చెయ్యకూడదు నిజమే. కానీ తప్పుపనులు చేసి బయటపడిపోవడం మరీ తప్పు. ప్రేమమయ మీ జీవితము. త్యాగమయ మీ శర్మ నన్ను ప్రేమిస్తున్నాడు. నన్ను ప్రేమిస్తున్నవారిని నేను ప్రేమిస్తున్నాను. శర్మతో మాత్రం బదుకు ఇంతకంటే సుఖంగా వెలుగుతుందా? నాకు పెళ్లి అక్కర్లేదు. ఏ ఉద్యోగం చేసినా బదికిపోగలను. తిరగబడాలనుకుంటాను. ధైర్యం చాలదు. ఈ లోకంలో ఆడదై పుట్టడమంత హీనం ఇంకోటి లేదు.

'ఆడబతుకే మధురం ఆహా'

నిజం ఆడదానికి ఇల్లే కోట అడదాన్ని గుమ్మం కదలనివ్వకూడదు. ఎన్ని ఆగచాట్లుపడి అయినా ఆడదాన్ని మొగాడే రక్షిస్తాడు. మొగాడు చెడిపోయినా ఫరవాలేదు. ఆడది చెడిపోతే ప్రపంచమే ధ్వంసమయిపోతుంది. క్షేత్రం బీజం అన్నారు.

తోముకోవడం అయిపోయింది. మళ్లీ నాలుగైదు చెంబులు దిమ్మరించుకున్నాడు.

ఒసే వంటయిపోతే వడ్డించు.

మీ స్నానం అయిందా?

అయినట్టే.

నా వంటకూడా అయినట్టే.

పెడసరపు జవాబులు. స్కూలు ఫైనలుదాకా చదివానని దీని గర్వం ఆడవాళ్లకి చదువు అవసరమే కాదు హానికరం.అయిదోక్లాసు దాకా చదివిస్తే చాలు.

అప్పుడే వంటింట్లోంచి వినబడింది 'తుమమేరా' అని స్నానాల గదిలో సబ్బు నురగల్లోనూ, వంట ఇంట్లో తాలింపు వాసనల్లోనూ కలిపి మగగొంతుకా ఆడగొంతుకా ఆలాపన సాగించాయి.

ఆఫీసుకి టైమయిపోతుంది. ఆడదానికి స్వాతంత్ర్యం ఇవ్వకూడదు.

శర్మని నేను ప్రేమిస్తున్నాను. పుట్టబోయే బిడ్డ అతనిదే అనుకుంటాను.

'తుమమేరా'

'తుమ మేరీ'

స్నానం ముగించాడు. మొగాడు అథార్టీ ఉంటూనే ఆడది అణిగిమణిగి ఉంటుంది. లేకపోతే ఈ ఆడవాళ్లకి పట్ట పగ్గాలుంటాయా?

ఆమె శర్మను గురించి ఆలోచిస్తోంది. అతడు తన హక్కును స్థాపించుకుంటున్న గొంతుకతో అరిచాడు.

– ఒసే! తువ్వాలు అందుకో!'



బంధం

కథ

-కె. ఉషారాణి
9492879210

అలారం ఆగకుండా మోగుతూనే ఉంది. నీలవేణికి మెలుకువ వచ్చింది. కానీ కన్నుల రెప్పలు విడడం లేదు. రాత్రి నిద్రలేదు. దాదాపు నెలరోజులైంది కంటి నిండా కునుకుతీసి...

నెలరోజుల క్రితం అమ్మకు నలతగా ఉందంటే డాక్టర్ దగ్గరికి తీసుకెళ్లింది. రోజంతా రకరకాల పరీక్షలు చేసి డాక్టర్ రొమ్ములో కణితి ఉందని దానిని అమ్మగమనించలేదని వివరించారు. చిన్నముక్క పరీక్షకు పంపాడు. పదిరోజుల్లో ఫలితం తెలిసింది. భయం నిజమయింది. అమ్మకు క్యాన్సర్ చివరి స్థాయికి చేరిందని నిర్ధారించారు. నీలవేణి తల విరిగింది. అమ్మకు ఎనభై ఏళ్లు. డాక్టర్ ఆపరేషన్ చేసి చూద్దాం అన్నారు చేయించింది. కీమో మొదలుపెట్టారు. హాస్పిటల్‌కి ఇంటికి తిరగడం ఓర్పుగా చేసింది. సాయంగా వచ్చే బంధువులు కనిపించలేదు. ఎవరి బాధ్యతలు వారివి! పగలు రాత్రి కనిపెట్టుకుని ఉండేందుకు మనుషులను పెట్టింది. కీమో ఆపారు. కొద్దిరోజులలోనే పుండు మళ్లీ విజృంభించింది. అమ్మ పూర్తిగా మంచం పట్టింది. బాధతో కేకలు! తీర్చలేని నిస్సహాయత! ఆమెకీ తనకీ ఇది పరీక్షే!

నెల క్రితం వరకు నీలవేణి సంసారనావ సజావుగా సాగింది.భర్త బ్యాంకు ఆఫీసరు. కూతురు కొడుకు. కూతురు భావన ఇంజనీరింగు చివరి సంవత్సరం లోకి వచ్చింది. బాగానే చదువుతుంది. పెళ్లి చేసేందుకు సిద్ధపడింది. కొడుకు ఆదిత్య చురుకైనవాడు. ఇంటర్ రెండో సంవత్సరం మంచి ర్యాంకు వచ్చే అవకాశం వుంది.వాడు చిన్నప్పటి నుండి సాఫ్ట్ వేర్‌లో ప్రవేశానికే ఉబలాట పడుతున్నాడు. ఆర్థిక ఇబ్బందులేమి లేవు. అమ్మ సాంప్రదాయ బద్ధంగా పెంచింది. అత్తింటి వారు అంతే. నీలవేణి చుట్టాలందరికి తలలో నాలుక. పూజలూ పునస్కారాలు, పెళ్లిళ్లు పేరంటాలు ఇటు పుట్టింటి వైపు జరిగినా, అటు అత్తింటివైపు జరిగినా హడావుడంతా నీలవేణి ఇంట్లోనే. షాంగ్‌కు ఎప్పుడూ సిద్ధం. ఉన్న పనులన్నీ సర్దుకుని ఓపికగా షాపింగ్‌కు వెళ్తుంది. అందుకే అందరూ నీలవేణి ఇంటికే వచ్చి తమ పనులకు తోడు తీసుకెళ్తుంటారు.

ఆచారాలు, సాంప్రదాయాలు చక్కగా పాటిస్తుందని నీలవేణిని చూసి అమ్మా ముచ్చట పడేది. నిజానికి నీలవేణి పెంపుడు కూతురు. నీలవేణి 'అమ్మా' అని పిలిచేది పెద్దమ్మను. పిల్లలు లేక చెల్లికూతురుని పెంచుకుంది అనసూయ. అనసూయ చెల్లి ప్రియంవదకు పిల్లలెక్కన అందుకే కొంత భారమన్నా, తగ్గించుకునేందుకు నీలవేణిని అక్క అనసూయకు దత్తత నిచ్చింది. పెదనాన్న తాసీల్దారు అందువల్ల నీలవేణి అమ్మగా మారిన పెద్దమ్మ దగ్గర గారంగానే పెరిగింది.

నీలవేణి పెంపుడు తల్లి కన్న తల్లి బాధ్యతలన్నీ తీసుకుంది. పోస్టు గ్రాడ్యుయేషన్ చదివించింది. మంచి సంబంధం చూసి పెళ్లి చేసింది. తన ఆస్తిని ఇచ్చింది. నీలవేణి దగ్గర భర్తపోయిన దగ్గరి నుంచి ఉంటున్నదన్న మాటేగాని ఆర్థికంగా ఆధారపడలేదు. సాంప్రదాయాలపై తనకున్న నమ్మకాలాను నీలవేణికి అందించింది. నీలవేణికి కూడా మంచి రోజులు చూడాలన్న నమ్మకం! ముత్తైదువగా తాంబూలాలు అందుకోవడం గౌరవమని నమ్మకం! వారం వర్జం చూడకుండా ఎలా పట్టింపులు లేని వారిని హేళన చేస్తుంది. దైవభక్తి పాపచింతన లేని వాళ్లంటే చులకన.



కళ్లు నులుపుకుని ఒళ్లు విరుచుకేలోగా అమ్మ గదిలోంచి మూలుగులు వినిపిస్తున్నాయి. నిన్నటి వరకు పెద్దగా వచ్చిన స్వరంలో మార్పు వినిపించింది. ఒక్కసారి ఉలిక్కిపడి లేచింది. గబగబా అమ్మా గదిలోకి అడుగులు వేసింది. నర్సు నాడి చూస్తోంది. 'నాడెలా గుంది?'

'కాస్త తగ్గిందమ్మ'.

'దగ్గర్లో డాక్లర్లు ఉన్నారేమో చూడు! ఈరోజు గడుస్తుందో లేదో కనుక్కుందాం.

'నాకు తెలిసి ఇటువైపు దగ్గర్లో డాక్టర్లు లేరమ్మా! అయినా ఇప్పుడు డాక్టర్లు వచ్చి చేసేది మాత్రం ఏముంది లే?

'సరే' పక్కింటి మామ్మగారిని పిలుపు. ఆమె మంచిరోజులు చూసి చెప్తారు.

మామ్మగారు పంచాగంతో వచ్చారు.

'ఈరోజు సాయంత్రం వరకు బాగుందమ్మా రేపు మంగళవారం. మారు కోరుతుంది. ఎల్లుండి నుంచి ఐదురోజులు మంచి ఘడియలు లేవు. ఇంట్లో ప్రాణం పోతే అరిష్టం. ఇక నీఇష్టం. ఎలా చేస్తావో ఏమో! అంటూ జారుకుంది.

నీలవేణికి తన కొడుకు, కూతురు బంగారు భవిష్యత్ అమ్మ ఇంట్లో చనిపోవడం వలన పాడుకాకూడదనుకుంది. తన భర్త ఆరోగ్యం, తన ఆరోగ్యం పణంగా పెట్టదలుచుకోలేదు, పంచాగంలోని ఫలితాలు తప్పవన్నీ నమ్మకంలో. పసిపాపగా ఉయ్యాలలో నిద్రపోక ఎడుస్తున్నప్పుడు అమ్మ పాడిన లాలిపాటలు గుర్తుకురాలేదు.

అంటు వ్యాధయినా లెక్క చేయకుండా ఆటలమ్మ పోసినప్పుడు అమ్మ వేపకొమ్మతో పగలు రాత్రి విసిరందని గుర్తుకురాలేదు. నాన్న డిగ్రీతో ఆపేద్దాం అన్నా తన కోరికమేరకు పోస్టు గ్రాడ్యుయేషన్ చేయించాల్సిందేనని నాన్నతో పోట్లాడడం గుర్తుకు రాలేదు. నాన్న తెచ్చిన సంబంధాలను నిశితంగా చూసి, అన్నీ అనుకూలంగా ఉన్న సంబంధం కుదిరే వరకు నాన్నను తొందర పడనివ్వని అమ్మ గుర్తుకు రాలేదు. అమ్మ చూడమని అలవాటు చేసిన ముహూర్తాలు చూడడం, ముహూర్తాలపై నమ్మకం మాత్రమే ముందుకొచ్చింది. వెంటనే పనమ్మాయితో వరండాలో గ్రిల్‌కు దుప్పట్లు కట్టించేసింది. వరండాని గదిగా మార్చింది. పక్కింటి ఆమెతో టేబిల్ ఫ్యాన్‌ని అడిగి అమర్చింది. వరండా తూర్పున ఉంది. ఎండ వరండాను ఆక్రమించుకుంది. దుప్పట్లు ఎండ ధాటిని ఆపలేదు. సూర్య ప్రతాపం అమ్మను అల్లాడించింది. మూలుగులు అరుపులుగా కేకలుగా మ్రోగాయి. అమ్మ శరీరంలోని పుండు మంటకు భానుడి ప్రతాపం చేయి కలిపింది. ఎనభైఏళ్ల పండుటాకు నిస్సహాయంగా విలపించింది. ఎదిరించే శక్తి లేదు. కదిలే శక్తిలేదు. క్యాన్సర్‌కణాలు చూపు పోగొట్టడంతో పగటికి రాత్రికి తేడా తెలియక చాలా రోజులయింది. మంటల్లో కాలుతున్నట్టు హాహా కారాలు!

ఆ అరుపులకు నీలవేణి కరిగి కన్నీరయింది.

పంచాంగం నిజమయ్యే అవకాశాలు ఉండొచ్చు.

కాని తనను జన్మనివ్వక పోయినా ప్రాణ పదంగా పెంచిన అమ్మ ఈ రోజు

చేస్తున్న ఆర్తనాదాలు ఓ నిజం!

ఐదు రోజులు ఈ విధంగా ఆమెకి ప్రత్యక్ష నరకాన్ని చూపడం తనవల్లకాదు. ఇలా ఉంచడం ఒకరకమయిన హత్యే ఈ నేరం తాను చేయలేదు. మనసులో గందరగోళం అలజడి తగ్గింది. మళ్లీ పనమ్మాయితో పక్కగదిలో వేయించింది. మూలుగు మాత్రం వినిపిస్తూనే ఉంది...

నీలవేణి వంటింట్లో పనిలో పడింది....

మర్నాడు లోకల్ పేపర్ తిరగేయంగానే నీలవేణికి కనిపించిన వార్త.

రోడ్డు దాటుతూ ఓ వృద్ధురాలి మృతి. గుర్తించలేని విధంగా బస్సు ఢీకొని ఒక వృద్ధురాలు మృతిచెందిదింది. ఆమె చేతిలో నుంచి పడిన పంచాంగం వల్లనే బంధువులు ఆమెను గుర్తించారు.

ఎర్ర బంగారం

- కుంకుమ పువ్వు చాలా ఖరీదు. దానికి కారణం అరుదుగా లభించడం, కేవలం కేసరాలు మాత్రమే పనికిరావడం. కాశ్మీరీలు కేసర్‌గా పిలిచే కుంకుమ పువ్వు అందుకే ఎర్ర బంగారమైంది.
- కుంకుమ పువ్వు వికసించేదీ కాలంలోనే. కాశ్మీర్‌లో ఈ కాలంలో సాఫ్రన్ ఫెస్టివల్ పేరిట ఉత్సవాలు చేస్తారు.

- కుంకుమ పువ్వును పండించడంలో జమ్మూ కాశ్మీర్‌ది మన దేశంలోనే తొలిస్థానమే గాక ప్రపంచంలోనే మూడవ స్థానం దక్కించుకుంది.
- కుంకుమ పువ్వును పర్షియన్, యూరోపియన్, అరబ్, టర్కిష్, భారతీయ వంటకాల్లో విరివిగా ఉపయోగిస్తారు.



- కాశ్మీరీ కుంకుమ పువ్వు ప్రపంచ ప్రసిద్ధి చెందినందున వివిధ దేశాలకు అక్కడి నుండే ఎగుమతి అవుతుంది.
- ప్రపంచంలోని విలువైన సుగంధ ద్రవ్యాలలో కుంకుమ పువ్వు కూడా ఒకటి.
- కుంకుమ పువ్వును సూర్యకాంతి తగలని ప్రదేశాలలో గాలి చొరబడకుండా ప్లాస్టిక్ బాక్స్‌లో భద్రపర్చాలి.
- ఆయుర్వేద మందులలో కుంకుమ పువ్వును వాడుతారు.



- దీని పంటకు కాశ్మీరే ఎందుకు అత్యంతనుకూలమంటే అక్కడి వాతావరణం చల్లగాను, సారవంతమైన నేల ఉండటమే.
- మార్కెట్‌లో దీన్ని మూడు పేర్లతో పిలుస్తారు. కుంకుమ లచ్చా, కుంకుమ మోంగ్రా, కుంకుమ జర్దా.
- కుంకుమ పువ్వును సౌందర్య సాధనాలలో ఎక్కువగా వాడుతారు.

- ఇరాన్ లెక్కల ప్రకారం ప్రపంచ ఉత్పత్తిలో కుంకుమ పువ్వు 70 శాతం కాశ్మీర్ నుంచే వస్తుందని తెలిపారు.
- కేసర్ మొక్క 20 నుంచి 30 సెంటీ మీటర్ల పొడవు పెరుగుతుంది. 5 నుండి 11 వరకు మొలకలు వస్తాయి.



- కాశ్మీరీ కుంకుమను లచ్చా, గుచ్ఛీ అని కూడా పిలుస్తారు.
- కుంకుమ పువ్వు చాలా మంచి సువాసన వస్తుంది. అమ్మకందారులు వాసనను చూపే అమ్ముతారు.

- కుంకుమ పువ్వులు చాలా తియ్యదనాన్ని ఇస్తాయి.
- కుంకుమ పువ్వులో అనేక విటమిన్లు పుష్కలంగా ఉంటాయి. అందులో ముఖ్యంగా విటమిన్ ఎ, సి, ఫోలిక్ యాసిడ్ ఉంటాయి.
- ఇది ముదురు కుంకుమ రంగు, ఊదా రంగులో ఉంటుంది.



- కాశ్మీరీ కేసరి జాతి మొక్కల్ని 2500 ఏళ్ల క్రితం శ్రీనగర్ దగ్గర పాంపోర్‌లో గుర్తించారు.
- చారిత్రక ఆధారాల ప్రకారం కుంకుమపువ్వును క్రీస్తు పూర్వం 500 సంవత్సరాల క్రితం పర్షియన్ పాలకులు ఇండియాకు తీసుకువచ్చారు. మరి కొందరు పరిశోధకులు చెప్పిన ప్రకారం 11, 12 శతాబ్దాలలో సూఫీ సన్యాసులు, కాజ్వాలు స్థానిక గిరిజన నాయకులు అనారోగ్యం పాలయినప్పుడు వైద్యం చేయడం కోసం తెచ్చారనే వాదనా ఉంది.

కొత్త పుస్తకాలు

సమాజ తీరుతెన్నులు స్పష్టం

అర్థం కాని సందర్భాలు
రచయిత: బెల్లం ప్రభాకర్
పేజీలు: 99, వెల: 100/-
ప్రతులకు: విశాలాంధ్ర బుక్‌హౌస్, నవోదయ బుక్ హౌస్, ప్రజాశక్తి బుక్ హౌస్, నవచేతన బుక్‌హౌస్.

వేదనలోనుండే కవిత వెలువడుతుందంటారు. చాలామంది కవుల జీవితాలు మహా సముద్రాల వలె అనుక్షణం క్షోభించి, ఆ క్షోభలో నుండి కవితా శోభను వెలువరించాయనే చెప్పాలి. కవిత్వం వేదన నుండి పుట్టినా, భావుకత నుంచి పుట్టినా భావం ప్రధానం. అది ప్రేమైనా బాధైనా, విప్లవమైనా, వర్గ సంఘర్షణ అయినా... భావాన్ని అనుభూతింపజేయాలి. ఒక కవితను ఎలా ప్రారంభించాలి, ఎలా కొనసాగించాలి, ఎలా ముగించాలి, ఎలా చెప్పాలి అనేదానిలో స్పష్టత వుండాలి. అది కవితలోని పాదాల్లో కనిపించాలి. వాక్యాల్లో బిగువు, పటుత్వం ఉండాలి. అందుకే... 'వాక్యం రసాత్మకం కావ్యం' అంటారు విశ్వనాథ వారు. కవితకు మరో లక్షణం లయ. ఇది శిల్పానికి వన్నె తెస్తుంది. చదువరులను కట్టిపడేస్తుంది. ఈ ఉపోద్ఘాతమంతా చెప్పడానికో కారణముంది. బెల్లం ప్రభాకర్ గారి కవితా సంపుటిలో ఆయన ఎంపిక చేసుకొన్న ఇతివత్తం (వస్తువు) అద్భుతం. కవితలో వస్తువు, భావం తర్వాత ముఖ్యమైనది పదాలు, పద ప్రయోగం. పదాల్లో నిపుణత వుండాలి. పద ప్రయోగంలో ఓ రిథమ్ వుండాలి. అప్పుడే అది జనసామాన్యమౌతుంది. అయితే ఈ కవిత్వంలో వస్తువు పట్ల కనబర్చిన శ్రద్ధ పదాలు, పద ప్రయోగం మీద కనబర్చలేదు. ఈ ఒక్క లోపాన్ని పక్కన బెడితే.... 'అర్థం కాని సందర్భాలు' లోని ప్రతి కవితా ఓ చైతన్య వీచిక. కవి తన ఆవేదనా పూరితమైన కంఠ స్వరాన్ని ధాటిగా వినిపించే ప్రయత్నం చేశారు. ప్రతి కవితలోను ఓ క్షోభ కనిపిస్తుంది. వినిపిస్తుంది. ప్రస్తుత సమాజ తీరుతెన్నులను 'అర్థం కాని సందర్భాలు' రూపంలో మన ముందుంచారు రచయిత. 51 కవితలున్న ఈ కవితా సంకలనంలో హృదయాన్ని తట్టిలేపేవి అనేకం వున్నాయి. 'ఒక మనిషి కథ' కవితలో 'నేటి శూన్యపు మనిషి/ బాధను వ్యక్తపరచలేడు/ సంతోషంగా వుండలేడు/ ముఖానికి మాస్కులేసుకొని/ మాట్లాడి మాట్లాడనట్టుగా వుంటాడు' అంటూ ఆధునికుడైన మనిషి జీవితంలో నటిస్తున్నందుకు బాధను వ్యక్తపరుస్తాడు రచయిత. అలాగే... కుర్చీలో కూర్చొన్నవారు... ఆ కుర్చీ ఎంత ఉన్నతమైనదో, దాని విలువేమిటో తెలుసుకొని మసలుకోవాలంటూ 'కుర్చీ' కవితలో చెబుతాడు. 'కుర్చీలకు కాళ్ళు మాత్రమే కాదు/ కళ్ళూ వుంటాయి/ కనిపించని బాధలుంటాయి/ జీవమున్న మనిషే కాదు/ నలుగురికి జవాబుదారీగా/ నిలబడే మహోన్నతమైన సాధనం' అంటూ కుర్చీ విలువను చక్కగా విశదీకరిస్తాడు. అదేవిధంగా 'అర్థం కాని సందర్భాలు' కవితలో 'ఈ దేశంలో భవతీ భిక్షాం దేహి అనాలో/ లేదో తెలుసుకోడానికి ఇప్పుడు/ ప్రపంచ బ్యాంకునడగాలి' అంటూ వ్యంగ్యమాడుతూనే.. 'అమర్త్యసేన్ చెప్పిన/ మానవీయ కోణం ఎక్కడికి పోయిందో/ అన్వేషించాలి మరి' అంటూ పాలకుల తీరుపై అసహనం వ్యక్తం చేస్తాడు. అలాగే 'నేనొక ఆధునిక ఛాండాలుణ్ణి' కవితలో 'అంతర్గత అంటరానితనాల మధ్య/ కాలం ఆధునికమయిందే తప్ప/ మనసులు ఆధునికం కాలేకపోతున్నాయి' అంటూ ఆవేదన చెందుతాడు. ఈ సంకలనంలోని కవితలన్నీ సామాజిక వివక్షను ప్రశ్నించేవే. దేనికదే ఓ ప్రత్యేకతను సంతరించుకున్న కవితలు. రచయిత బెల్లం ప్రభాకర్ తానెన్నుకున్న ఇతివృత్తాన్ని కవిత్వీకరించే క్రమంలో కాస్తంత జాగ్రత్త తీసుకొన్నట్లయితే మరింత మంచి కవిత్వాన్ని ఆయన కలం నుంచి పొందవచ్చునని ఘంటాపథంగా చెప్పొచ్చు.

- రాజాబాబు కంచర్ల

అంబేడ్కర్ తత్త్వశాస్త్రం అవసరం



అంబేడ్కర్ తత్వశాస్త్రం
రచయిత: డా. కత్తి పద్మారావు
పేజీలు: 463
వెల: 500/-
ప్రచురణ: లోకాయిత ప్రచురణలు-2016

'అంబేడ్కర్‌ను ప్రపంచ తత్త్వవేత్తలలో ఒకరిగా గుర్తించడం ఒక బాధ్యతగా.. ఆయన తత్త్వశాస్త్ర పునాదుల్ని అధ్యయనం చేయటం ఒక చారిత్రక కర్తవ్యంగా దళిత బహుజన మేధావులు గుర్తించినట్లయితే ప్రతి గ్రామంలో అంబేద్కర్ తాత్విక శిబిరాలు రూపొందే చారిత్రక క్రమం ముందుకు వస్తుంది'.

అంబేద్కర్ రచనలను సాధికారంగా పరిశీలించి తెలుగులోకి తెస్తున్న బహుముఖ ప్రజ్ఞాశాలి కత్తి పద్మారావు ప్రతిపాదన ఇది. 'అంబేద్కర్ తత్త్వ శాస్త్రం' గ్రంథం 2006లో ప్రచురించినా ఇప్పుడు ఈ మూడవ ముద్రణ మరిన్ని మార్పులు చేర్పులతో ఆకర్షణీయంగా వెలువడింది. 450 పేజీలున్న ఈ బృహత్ గ్రంథం అంబేద్కర్ తాత్విక దృక్పథాన్ని పలు కోణాల నుండి పరిశీలన చేసింది. ప్రపంచాన్ని మార్చిన సోక్రటీస్, ప్లేటో, బుద్ధుని తత్త్వశాస్త్రాలతో అంబేద్కర్ తాత్విక దృక్పథాన్ని పోల్చి అధ్యయనం చేశారు. 'బుద్ధుడు, అంబేద్కర్ సమాజ పునర్ నిర్మాణానికి అంకితమయ్యారు. అందుకే వారు దార్శనికులు. వారు తమ ముందున్న స్తబ్ధ సమాజాన్ని తిరస్కరించటమే కాక, ప్రత్యామ్నాయ రూపాన్ని, నిర్మాణాత్మక సూత్రాలను అందించారు' అని ఆయన విశ్లేషించారు. 'కులం, జాతి, రంగులపై నిర్మితమైన అసమానత్వాలను రూపుమాపాలి. మహా గొప్ప నాయకుడైన అంబేద్కర్ ఆదర్శాలు, జీవిత తత్త్వం, విజ్ఞానం, వివేకం, ప్రేమ, త్యాగం, సేవానిరతి వంటి అంశాలు రాబోయే శతాబ్దాలలో కూడా భావి తరాలకు దిక్సూచిగా తోవ చూపుతాయి' అని ప్రతిపాదించారు. సామాజిక ఉద్యమాలలో మూడు దశాబ్దాలు పని చేస్తున్న డా.కత్తి పద్మారావు ఈ గ్రంథ రచన కోసం కఠోర శ్రమ చేశారని అనిపిస్తోంది. భవిష్యత్ తరాలకు ఈ గ్రంథం ఎంతో ఉపయుక్తం.

- భవిష్య

ఫిష్ కుర్మా

కావాల్సిన పదార్థాలు

చేప ముక్కలు-1/2 కెజి (కొరమీను లేదా రహు ఫిష్)
ఉల్లిపాయలు-2 (సన్నగా కట్ చేయాలి)
టమాటాలు-2 (సన్నగా కట్ చేయాలి)
పచ్చిమిరపకాయలు-4
కరివేపాకు-2 రెబ్బలు
కొత్తిమీర -1/4 కప్పు
పసుపు-1/4 టేబుల్ స్పూన్
కారం-1 టేబుల్ స్పూన్
కొబ్బరి పొడి- 2 టేబుల్ స్పూన్లు
గసగసాలు-1టేబుల్ స్పూన్
జీలకర్ర పొడి- 1టేబుల్ స్పూన్
మెంతిపొడి- 1/4 టేబుల్ స్పూన్
అల్లం వెల్లుల్లి పేస్ట్-2 టేబుల్ స్పూన్లు
గరం మసాలా పొడి-1 టేబుల్ స్పూన్
నూనె- సరిపడా
ఉప్పు- రుచికి తగినంత

తయారుచేసే విధానం

చేప ముక్కలను కడిగి నిమ్మరసం వేసి ఒక బౌల్‌లో అరగంట పాటు నాననివ్వాలి. స్టౌపై పాన్ పెట్టి నూనె వేసి వేడెక్కిన తర్వాత సన్నగా తరిగిన ఉల్లిపాయ ముక్కల్ని వేసి బంగారు రంగు వచ్చేవరకు వేయించుకోవాలి. తర్వాత అల్లం వెల్లుల్లి పేస్ట్, కరివేపాకు, పసుపు, కారం వేసి కొద్దిసేపు వేయించి ఒక ప్లేట్‌లో పక్కన పెట్టుకోవాలి. ఇప్పుడు పాన్‌లో మరికొంచెం నూనె వేసి అందులో నిలువుగా చీల్చిన పచ్చి మిరపకాయలు, కొబ్బరిపొడి, గసగసాలు, జీలకర్ర, మెంతిపొడి వేసి సన్నని మంటపై వేయించుకోవాలి. అందులో సన్నగా తరిగి పెట్టుకున్న టమాటా ముక్కలు కూడా వేసి వేయించాలి. టమాటా ముక్కలు ఉడికిన తర్వాత అందులో వేయించి పెట్టుకున్న ఉల్లిపాయ ముక్కలు, చేప ముక్కలు కూడా వేసి వేయించుకోవాలి. అందులో రెండు కప్పుల నీరు, తగినంత ఉప్పు వేసి బాగా కలిపి మూత పెట్టాలి. మొత్తం మిశ్రమం పూర్తిగా ఉడికిన తర్వాత గరం మసాలా, కొత్తిమీర తరుగు వేసి రెండు నిమిషాల తర్వాత స్టౌపై నుండి దింపేయాలి.

బాంగ్రా ఫిష్ రసం

కావాల్సిన పదార్థాలు

బంగ్రా చేపలు-4
ఉల్లిపాయ ముక్కలు-1 కప్పు
టమాటా ముక్కలు-1కప్పు
కారం-1/2 టీ స్పూన్
ధనియాల పొడి-1/2 టీ స్పూన్
ఎండుమిర్చి-5
జీలకర్ర-1/4 టీ స్పూన్
ఆవాలు-1/4 టీ స్పూన్
పసుపు-1/4 టీ స్పూన్
ఉప్పు-రుచికి సరిపడా
నూనె-తగినంత

తయారుచేసే విధానం

ముందుగా చేపలను శుభ్రం చేసి వాటిని చిన్న చిన్న ముక్కలుగా కట్‌చేసి పక్కనపెట్టుకోవాలి. స్టౌపై పాన్ పెట్టి కొద్దిగా నూనె వేసి వేడెక్కిన తర్వాత అందులో జీలకర్ర, ఆవాలు, పసుపు, ఎండుమిర్చి వేసి వేయించుకోవాలి. తర్వాత ఉల్లిపాయ ముక్కలు టమాటా ముక్కలు వేసి వేయించాలి. అందులో ఒక కప్పు నీరు పోసి ఉడికించుకోవాలి. టమాటా ముక్కలు బాగా ఉడికిన తర్వాత అందులో చేప ముక్కలు, ఉప్పు వేసి బాగా కలియబెట్టాలి. చేప ముక్కలు ఉడికిన తర్వాత స్టౌపై నుండి దించేయాలి. ఇప్పుడు భాంగ్రా ఫిష్ రసాన్ని వేడి వేడి అన్నంతో రుచి చూడండి.

కొరమీను చేపల పులుసు

కావాల్సిన పదార్థాలు

కొరమీను చేపలు- 1/2 కెజి
ఉల్లిపాయలు-3 (సన్నగా కట్ చేసినవి)
పచ్చిమిర్చి-4 (సన్నగా కట్ చేసినవి)
కారం-1 టేబుల్ స్పూన్
పసుపు-1 టేబుల్ స్పూన్
ఉప్పు-రుచికి తగినంత
నూనె- సరిపడా
నీళ్లు-1 కప్పు
అల్లం వెల్లుల్లి పేస్ట్-2 టేబుల్ స్పూన్లు
ధనియాల పొడి-1 టేబుల్ స్పూన్
గరం మసాలా-1 టేబుల్ స్పూన్
కొత్తిమీర తరుగు-1 కప్పు

తయారుచేసే విధానం

ముందుగా కొరమీను చేప ముక్కలను శుభ్రం చేసుకోవాలి. ఒక బౌల్‌లో కారం, పసుపు, ధనియాల పొడి, అల్లం వెల్లుల్లి పేస్ట్, గరం మసాలా చేప ముక్కలు వేసి బాగా కలిపి అరగంట నాననివ్వాలి. స్టౌపై ఒక మందపాటి పాత్ర వుంచి నూనె వేసి వేడెక్కిన తర్వాత ఉల్లి పచ్చిమిర్చి ముక్కలు వేసి వేయించుకోవాలి. తర్వాత చేప ముక్కలు కూడా వేసి బంగారు రంగు వచ్చేవరకు వేయించాలి. అందులో కప్పు నీరు పోసి మూత పెట్టి సన్నని మంటపై పది నిమిషాల పాటు ఉడికించాలి. తర్వాత కారం, పసుపు, ఉప్పు కూడా వేసి అరగంట పాటు ఉడికించుకోవాలి. కమ్మని వాసన వచ్చిన తర్వాత స్టౌపై నుంచి పాత్రని తీసి కొత్తిమీర తరుగుతో గార్నిష్ చేస్తే కొరమీను చేపల పులుసు రెడీ!

బాల నేస్తాలు



లెక్కించండి

ఇక్కడ కనిపిస్తున్న బొమ్మల్లో ఒక వరుస క్రమాన్ని అనుసరించి ఏర్పడిన అంకెలనుంచాం! అయితే ఆ వరుసలో చివరి బొమ్మ మాత్రం ఖాళీగా వుంది. ఆ అంకె ఎంతైవుంటుందో కనిపెట్టి ఖాళీగా వున్న బొమ్మలో నింపండి.

జ : +2, +3, +4, +5 (35+ 5 = 40)



దారి కనుక్కోండి

ఇక్కడున్న చిన్నారికి పువ్వుని చేరుకునే దారిని కనిపెట్టండి.



ఏ నీడ ఎవరిది

పిల్లలూ! ఇక్కడ కొన్ని జంతువులు వాటి ఎదురుగా నీడలు ఉన్నాయి. ఏ జంతువు నీడ ఎక్కడుందో గుర్తించి వాటిని జత చేయండి.

ఆకులతో బొమ్మ

మనింటి ముందు రాలి పడిపోతుండే ఎండు పచ్చి ఆకులతో జింక బొమ్మ ఎలా చేయొచ్చో ఇక్కడ ఇచ్చాం! దానిని గమనించి మీరూ తయారుచేసేయండే!

లిటిల్ స్టార్

హాయ్ ఫ్రెండ్స్ నేనొక బాలీవుడ్ స్టార్‌ని! ఇది నా చిన్ననాటి ఫోటో ఇంతకీ నేనెవరో చెప్పండి?

జ: శ్రద్ధా కపూర్

చుక్కలు కలపండి







తేడాలు గుర్తించండి

ఈ రెండు బొమ్మల్లో మొత్తం పది తేడాలు ఉన్నాయి. వాటిని మీరు గుర్తించి సున్నా చుట్టేయండి.

పాంగొలిన్

పిల్లలూ! మీరు నీళ్లలో ఉండే మొసళ్లని చూసే ఉంటారు. మరి మొసలి ఆకారానికి కాస్త అటు ఇటుగా ఉండే పాంగొలిన్‌లని మీరెప్పుడైనా చూశారా.

- ఇవి సౌతాఫ్రికా, ఆసియా ఖండాల్లోని ఉష్ణ ప్రదేశాల్లో ఎక్కువగా సంచరించే చిన్న క్షీరదాలు.
- గోధుమ, నలుపు రంగుల్లో వీటి శరీరంపై పొలుసులుగా ఏర్పడిన భాగం వీటి ప్రత్యేక ఆకర్షణ.
- 30 నుండి 100 సె.మీ పొడవుండే పాంగొలిన్‌లు రాత్రి పూట మాత్రమే నేలపై తిరుగుతూ ఆహారాన్ని సమకూర్చుకుంటాయి. కొన్ని ఆఫ్రికన్ పాంగొలిన్‌లు చెట్లను కూడా ఎక్కగలవు.
- వీటి కంటిచూపు అన్నీ జంతువుల కంటే చాలా తక్కువగా ఉన్నప్పటికీ వాసన, వినికిడి శక్తి కారణంగా ఇవి ఆహారాన్ని సేకరించగలవు.
- చిన్న చిన్న పురుగులు చీమల్ని మాత్రమే ఇవి ఆహారంగా తీసుకుంటాయి.
- ఇతర జంతువుల్లా వీటికి పదునైన పళ్ళు లేకపోయినా దాదాపు 40 సె.మీ వరకు వీటి నాలుకని చాపి ఎక్కువ మొత్తంలో ఆహారాన్ని లాగించేస్తుంటాయి.
- వీటి శరీరంపై ఉండే పొరలు కెరటిన్ అనే పదార్థంతో ఏర్పడతాయి.
- డైనోసర్ కొమ్ము కూడా ఈ పదార్థం ద్వారా తయారైనదే.



- సాధారణంగా అన్ని జంతువులని సింహాలు తన పదునైన పంజాతో దాడి చేస్తుంటాయి. కానీ పాంగొలిన్‌లని మాత్రం ఇవి గాయపరచలేవు. దీన్ని బట్టే వీటి శరీర పైభాగం ఎంత ధృడంగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు.
- ఇతర జంతువుల నుండి రక్షించుకునేందుకు ఇవి ఒక బంతి రూపంలో శరీరాన్ని చుట్టుకొని అలా చాలా సమయం ఉండిపోగలవు. బంతి లా చుట్టుకున్న శరీరంలోనే వాటి ముఖం, కాళ్లు చేతులని దాచేసుకుని తమని తాము రక్షించుకుంటాయి.
- శరీరాన్ని ముడుచుకోగలిగే ప్రత్యేక లక్షణం కారణంగానే వీటికి పాంగొలిన్ అనే పేరు వచ్చింది.
- ఆసియాలోని చాలా ప్రాంతాల్లో వీటి మాంసాన్ని ఆహారంలో ఎక్కువగా తీసుకుంటారు.
- వివిధ దేశాల్లో పాంగొలిన్‌ల శరీరంపై ఉండే పొలుసులని దుస్తులు, ఔషధాల తయారీలో ఉపయోగిస్తుంటారు.
- మాంసం కోసం వీటిని అధికంగా వేటాడుతుండడంతో
- ప్రపంచ వ్యాప్తంగా పెద్ద ఎత్తున పాంగొలిన్‌లు అక్రమ రవాణాకి గురవుతున్న కారణంగా ఇవి పూర్తిగా అంతరించిపోయే ప్రమాదం ఉందని నివేదికలు వెల్లడయ్యాయి.

పదవికాసం - 38

కూర్పు: రావెళ్ల

1		2			3	4		5
				6				
7			8		9		10	
		11			12	13		
	14					15		
16		17	18		19			20
21			22	23			24	
		25				26		
27					28			

ఆధారాలు

అడ్డం

1. క్రితం నెల చివరిలో జరుపుకున్న పండుగ (4)
3. నొక్కి చెప్పు (4)
7. పొడి (2)
8. వాంఛ (3)
10. తలా... లేదు (2)
11. ఇవి ఒక రకం కిరణాలు (2)
12. రుణం ఇస్తే (2)
14. కుమ్మరి చక్రం (2)
15. శూన్యం (2)
17. సన్మానం చేసి కప్పే దానిలో మొదలులేదు (2)
19. తుదిలేని మేసెను (2)
21. సూర్య కిరణం (2)
22. కింది ఏడు లోకాలలో చివరిది(3)
24. పరిచారిక (2)
27. పలుకుబడి (4)
28. ఒక రకపు చెట్టు (4)

నిలువు

1. ఆశీర్వచనాలు (4)
2. మాట్లాడే వాడు (2)
4. పొగతాగే సాధనం తలకిందులైంది (2)
5. తేలిక (4)
6. శత్రువు (2)
8. జీవచ్ఛవంగా పడివుంటే దీనిలోకి వెళ్ళాడంటారు (2)
9. మండూకం (2)
11. తింటే ఇవే తినాలి (3)
13. ఒక రకం పిండి వంటకం (3)
16. అభిమానం లేదా నమ్మకం పొందు (4)
18. వారి పొకలులో 1,3 అక్షరాలు(2)
19. సన్నాయి(2)
20. నల్లబడు (4)
23. ఒకరకం పాము (2)
25. ఒక విధమైన వాయిద్యం (2)
26. అక్క భర్త (2)

సుడోకు

9	1	6	2	4				
2	3							
			1		8			2
5	2	1						7
	8	9				5	1	
7	6			9				3
				8		7	2	1
	9				4	6		5
	7	3			5			

గతవారం జవాబులు

8	9	2	5	7	3	6	1	4
7	4	6	9	2	1	8	3	5
3	1	5	4	6	8	9	7	2
4	5	7	6	8	2	3	9	1
9	6	8	1	3	5	2	4	7
1	2	3	7	4	9	5	6	8
2	7	1	8	9	6	4	5	3
5	3	9	2	1	4	7	8	6
6	8	4	3	5	7	1	2	9

	1 మా	2 గా	య		3 జీ	4 వు	లు	
5 ఆ		లి		6 క		చా		
7 శీ	తం		8 న	వ్విం	చ		9 జా	10 ము
ర్వ		11 డ		చ		12 తా		గ్గ
13 దిం	పు	కూ	లి		14 సు	జే	దా	రు
చ		లి		15 దు		లు		క
16 ట	క్కు		17 చ	ర్మ	ము		18 తా	వు
		19 పే		తి		20 నా		లు
	21 బు	దు	గు		22 న	వ	మి	

పెన్సిల్‌తో మలిచేయ్





పెన్సిల్‌తో బొమ్మలు వేయొచ్చు. కానీ పెన్సిల్‌నే బొమ్మలుగా మార్చేస్తే. అవి సైకిళ్లు, పడవలు, కార్లు, రైళ్లు, టేబుళ్లు, మసీదులు, ఆకాశ హార్మ్యాలు ఇలా ఒకటేంటి ఎన్నో మెత్తగా నగిషీ అవుతాయి. మలేషియా కళాకారుడు సిరాజుద్దీన్ కమల్ బచ్చా పెన్సిల్ శిల్పాలను తొలచి దిద్దడంలో దిట్ట. ఆయన దేశ ల్యాండ్‌మార్క్ పెట్రోనాస్ టవర్స్ మనోడి కళా సృష్టికి కూడా ల్యాండ్ మార్క్ అయ్యాయి. కావాలంటే మీరూ చూడండి ఆ జంట ఆకాశ హార్మ్యాలు గ్రాఫైట్ ఎంత బుల్లిగా భలే నిలబడ్డాయో. ఒక్కో పెన్సిల్ శిల్పానికి 2 నుంచి 212 గంటల సమయం తీసుకుంటాడు. ఎందుకంటే ఏ చిన్న తప్పిదం జరిగినా మళ్లీ మొదటి నుంచే. అంత కష్టమేమి రబ్బర్‌తో తుడిచిపెట్టుకుపోలేదు. విస్మయకర వస్తువులు, విషయాలతో ప్రపంచాన్ని నోరెళ్లబెట్టించే "రిప్లీస్ బిలీవ్ ఇట్ ఆర్ నాట్" సేకరణకు ఆయన శిల్పాలు ఎంపికయ్యాయి.





వన్నె ప్రాణులు

ఒంటి మీద ఇంద్ర ధనువును
విరుచుకుని, కలర్ పాలెట్‌ను తగిలించుకుని
వన్య ప్రాణులు తిరుగుతుంటే వనానికి వన్నె. మనకు
కనులున్నందుకు మన్ననే. సంద్రంలో చిలికిన రంగులు, ఆకాశంలో పొదిమిన వర్ణాలు,
నేలంతా పాకిన ఛాయలు.. జీవులై ఈదేస్తుంటే, రెక్కలాడిస్తుంటే, గెంతుతుంటే
పుడమికి పులకింతే. ప్రపంచంలోని 'పెయింటెడ్' ప్రాణులివే. మన జాతీయ పక్షి నెమలి
పింఛాలు విచ్చుకున్నా, అమెజాన్ రెయిన్‌బో పారాకీట్లు
ముడుచుకున్నా మన కళ్లు విప్పార్చుకోవాల్సిందే. లక్షల పిక్సెల్స్
ఉన్నందుకు మన కళ్ల లెన్స్‌లను కను రెప్ప వేసి
హత్తుకోవాల్సిందే. కన్నీరొలికించి
తడిమి ముద్దాడాల్సిందే.

Check List

Book Number	KNSR02BK44	Date	03/09/22
Front Cover	yes	Back Cover	yes
Blank Pages	NO		
Missing Pages	NO		
Prepared By	Mouni	Cutting By	Mouni
Scanned By	Shameera	Pages	29